ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

3

బుధవారం 26 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	155	170
సూర్యాపేట	రూ.100	150	175
నల్లగొండ	రూ.115	160	170

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 కనిష్ఠం 20.0



హర హర మహాదేవ!

విద్యుత్‌కాంతుల వెలుగుల్లో పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయం

మహాశివుడు ఉద్భవించిన రాత్రి మహాశివరాత్రి. మాఘ బహుళ చతుర్దశి అర్ధరాత్రి ఆరుద్ర నక్షత్రంలో మహాశివుడు ఉద్భవించాడని శివ పురాణం చెబుతోంది. మహాశివుడు ఉద్భవించిన సమయాన్ని లింగోద్భవ కాలమని అంటారు. అలాంటి మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. జాగారం చేస్తూ శివనామ స్మరణతో తరిస్తారు. అందుకు జిల్లాలోని ప్రముఖ శివాలయాలన్నీ సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆలయాలను శుద్ధి చేసి వివిధ రంగులతో అలంకరించారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రత్యేకంగా భక్తులకు వసతి కల్పించారు. జిలాల్లోని ప్రముఖ దేవాలయాలైన పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర ఆలయంతోపాటు పలు ఆలయాల్లో సర్వం సన్నద్ధం చేశారు.

వేడుకలకు ముస్తాబైన పానగల్‌లోని పచ్చల సోమేశ్వరాలయం

6 ● నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు ● ముస్తాబైన శివాలయాలు

మన ఊరు-మన బడికి..

నిధుల గ్రహణం

● అసంపూర్తిగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తిగా నిలిచిన గాంధీపార్క్ పాఠశాలలోని తరగతి గదుల నిర్మాణం

మన ఊరు మన బడి పథకం కింద ప్రారంభించిన తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. నిధులు విడుదల చేయకపోవడంతో 2022లో ప్రారంభించిన పనులను కాంట్రాక్టర్లు అనేక చోట్ల పూర్తి చేయలేదు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదన్న విమర్శలున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలన్న లక్ష్యం నిధుల్లేక నీరసించిపోతోందని విద్యాకమిటీల నేతలు విమర్శిస్తున్నారు. పనులు పూర్తయిన మేరకు ఎంబీ రికార్డు చేస్తే నిధులు మంజూరు చేస్తామన్నారని, అప్పులు తెచ్చి పనులు చేస్తే ప్రభుత్వం నిలువునా ముంచిందని విమర్శిస్తున్నారు. పనులు మొదలైన తొలినాళ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకటి, రెండు పార్ట్‌బిల్స్ విడుదలచేసి 2023 మే తర్వాత రేపు మాపు అంటూ నిధుల విడుదలను పెండింగ్‌లో పెట్టారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. గత మూడేళ్లుగా బిల్లులకోసం ఎదురు చూడాల్సి వస్తోందని అప్పులు తీర్చలేక, నలుగురిలో తిరగలేక ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో..

పంచాయితీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో మూడుమండలాల్లో సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన 63పనుల్లో 17 మాత్రమే పూర్తి కాగా నిధులు మంజూరు చేయక 46 పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

● దామరచర్ల మండలంలో రూ.3,20,48,594 అంచనా వ్యయంతో 16పనులు చేపట్టగా రూ.1,67,74,135 మేరకు మాత్రమే పనులు..

- మిగతా 6వ పేజీలో...

ప్రలోభాల పర్వం

● ముగిసిన ప్రచారం ●

» ఫోన్‌పేకు రూ.2వేలు పంపుతున్న వైనం

» ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అధికారుల చర్యలు

ఉపాధ్యాయ సంఘాలు ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ముగియగానే ఓట్లకోసం ప్రలోభాలు మొదలయ్యాయి. మేధావి వర్గానికి సైతం ప్రలోభాల ఎరవేయడంపై విమర్శలు వస్తున్నప్పటికీ అడ్డదారులు ఆగడం లేదన్న చర్చ సాగుతోంది. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గంలో బలంగా పోటీపడుతోన్న కొందరు అభ్యర్థుల తరపున వారికి మద్దతిస్తోన్న, వారి తరపున పనిచేస్తున్న ప్రతినిధులు ఇప్పటి కే ఎక్కడికక్కడ విందులతో సందడి చేస్తుండగా, మంగళవారమే కొంద రు ప్రతినిధులు కవర్లలో ఓట్లకు డబ్బులందించారని, మరో అభ్యర్థి తరపున ఫోన్‌పేలలో డబ్బు అందించార ని చెబుతున్నారు. ఇంకో అభ్యర్థి తరపున పనిచేసే ప్రతినిధులు మొత్తం ఓటర్ల జాబితా, వారి ఫోన్‌నెంబర్లు, వారి కుటుంబీకుల ఫోను నెంబర్లు సేకరించారని, వీరందరికీ బుధవారం లేకపోతే గురువారం ఓటింగ్‌కు వెళ్లే సమయానికి నగదు పంపిణీ చేస్తారని చెబుతున్నారు. మంగళవారమే అభ్యర్థులకు సంబంధించి ఓట్లకు డబ్బుల పంపిణీ మొదలుపెట్టినట్లు సోషల్‌మీడియా గ్రూపులలో వైరల్ గా మారడం చర్చనీయాంశంగా మారింది. పరిమిత ఓటర్లు, మేధావి వర్గమైన ఉపాధ్యాయులకే ఓట్లకోసం డబ్బు ఎరవేయడం దారుణమని, ఈ ప్రలోభాలపై ఎన్నికల సంఘం దృష్టి సారించి చర్యలు చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

హైస్కూల్ ఓట్లే 90 శాతం వరకు..

బలమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో కీలకమైన ఉపాధ్యాయ విభాగపు ఓట్ల కోసం ప్రధాన అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఎన్నికల బరిలో ...

- మిగతా 5వ పేజీలో...



ప్రలోభపెట్టాలని ప్రయత్నించడం దారుణం : టీఎస్‌యూటీఎఫ్

నల్లగొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేయాలనే ప్రయత్నాలు చేయడం దారుణమని, ఈచర్యలను ఉపాధ్యాయులంతా అడ్డుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావా రవి, ఏ.వెంకట్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రచారం ముగిసిన వెంటనే కొందరు అభ్యర్థులు ప్రలోభాలకు తెరదీసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక అభ్యర్థి పక్షాన గుర్తుతెలియని వ్యక్తులు రూ.2వేల ఫోన్‌పే చేస్తున్నారని తెలిపారు. కొందరు ఓటర్లు ఆ డబ్బుని తిరస్కరిస్తూ రిటర్న్ పేమెంట్ చేశారని వెల్లడించారు. మరో ప్రముఖ సంఘం పక్షాన భద్రాద్రి జిల్లాలో రూ.100, ఖమ్మం జిల్లాలో రూ.2వేలు, మహబూబాబాద్ జిల్లాలో రూ.5వేల చొప్పున పంపిణీ చేసినట్లు తమకు సమాచారమొచ్చిందన్నారు. నగదుని తిరస్కరించిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నామని పేర్కొన్నారు. డబ్బు పంపిణీని తమసంఘం తీవ్రంగా ఖండిస్తుందని, ఎన్నికల సంఘం డబ్బు పంపిణీని అడ్డుకోవాలని, పంపిణీ చేసిన, చేస్తున్న అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పోలింగ్ రోజున విద్యాసంస్థలకు సెలవు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈ నెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిమిత్తం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, కార్యాలయాలకు స్థానిక సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఆయా విద్యాసంస్థలు, కార్యాలయాల అధిపతులు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ రోజున స్థానిక సెలవు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 37పోలింగ్ కేంద్రాలున్నాయని, పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించే ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలకు 27న స్థానిక సెలవుదినంగా ప్రకటిస్తున్నట్లు వివరించారు.



ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు. పోలింగ్‌కు ముందు 48 గంటలు అనగా.. 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ పోలింగ్ ముగిసే వరకూ సైలెంట్ పిరియడ్ ఉంటుందన్నారు. సైలెంట్ పిరియడ్‌లో సభలు, సమావేశాలు నిర్వహించరాదని, సుమారు 600మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికలు ముగిసే వరకూ 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉంటుందన్నారు.

సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షిస్తాం

● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గం ఇన్‌లెట్ వద్ద జరిగిన ఘటనలో చిక్కుకున్న బాధితులను రక్షించడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం దోమలపెంట శ్రీశైలం సొరంగమార్గాన్ని పరిశీలించి, తిరుగు ప్రయాణంలో దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు ఆగారు. ఎమ్మెల్యే బాలునాయక్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సొరంగ మార్గం ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అందులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, కొర్ర రాంసింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాన్‌యాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, వేమన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి

ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫెయిర్‌వెల్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలించి యువతను సన్మార్గంలో పయనించే విధంగా చేయాలనే ఉద్దేశంతో 'మిషన్ పరివర్తన్' కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్, షీటీమ్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైనా వేధింపులకు గురి చేసినా ఇబ్బందులు పెట్టినా వెంటనే షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐఈవో దస్రునాయక్, రిటైర్డు ప్రిన్సిపాల్ మందడి నర్సిరెడ్డి, ఇస్మాయిల్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలి

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



జిల్లాకేంద్ర ఆస్పత్రిలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, పక్కన ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కొన్ని కేసుల విషయంలో రోగులు, వారి సహాయకులు డాక్టర్లను, సిబ్బందిని పరుష పదజాలంతో దూషించడం వంటి సంఘటనలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని, డాక్టర్లను ఇబ్బంది పెట్టవద్దని ఆమె కోరారు. గతంతో పోలిస్తే జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. మంగళవారం ఆమె జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మాతా, శిశు సంరక్షణ విభాగం, ఇతర విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలున్నాయని, సమర్థులైన డాక్టర్లు ఉన్నారని తెలిపారు. 24 గంటలు కాకుండా 48 గంటలు నిరంతరం పనిచేసేందుకు ఇక్కడ డాక్టర్లు సంసిద్ధులుగా ఉన్నారన్నారు. సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారని, రేడియాలజిస్టును కూడా డిప్యూటేషన్‌పై తీసుకున్నట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరుగుతున్న సంఘటనల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ కొంతమంది కావాలని డాక్టర్లను, సిబ్బందిని వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేయవద్దని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ అరుణశ్రీ, డాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడారు.

సంత్ సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సంత్‌సేవాలాల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భగవాన్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోజు ప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ లంబాడీల ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలో బంజార భవన్ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 20 గుంటల స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.20లక్షలను మంజూరు చేశారని తెలిపారు. మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, భగవాన్ నాయక్, ఆంగోతు ప్రదీప్ నాయక్, రిటైర్డు డీటీడబ్ల్యూవో పాండు నాయక్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ ఉన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

● జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, నీటి సరఫరా, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవిలో ఎక్కడెక్కడ నీటి ఎద్దడి ప్రబలంగా ఉంటుందో ఇప్పటినుంచే అంచనా వేసి అందుకు తగినట్టుగా చర్యలు చేపట్టాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కే.ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్, భగీరథ గ్రిడ్, ఏఈలు పాల్గొన్నారు.



మాతృభాషపై మమకారంతో..



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి(ఫైల్)

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం తిమ్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలుగు ఉపాధ్యాయుడిగా పాఠాలు చెప్పడమే కాదూ, తెలుగుపై మమకారాన్ని పెంచేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. తెలుగు భాషపై మక్కువ పెంచుకునేలా ప్రేరణ కలిగిస్తూ భాష ఔన్నత్యానికి కృషి చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

భాస్కర్‌రెడ్డి 2012 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి నేతాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. ప్రస్తుతం తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్లతండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా చేరిన నాటి నుంచి విద్యార్థులు తెలుగుపై పట్టు సాధించేలా కృషి చేస్తూనే సాహిత్యంపై ఆసక్తి కలిగింపచేసి కవితలు, కథలు రాసేలా ప్రేరేపించారు. అవి వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యేలా చేసి విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు.

విద్యార్థులతో రాయిస్తూ...



హరితహారం కార్యక్రమంపై విద్యార్థులు రాసిన కవితలు పచ్చనిచెట్లు, చిట్టి చెట్టు, తరువు, హరితయజ్ఞం శీర్షికలతో పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పిల్లలు విహారయాత్రలో చూసిన అంశాలు ఆ క్షణంలో తమ మిత్రులతో కలిసి పొందిన అనుభూతులను తెలుపుతూ రాసిన వ్యాసాలను తన సంపాదకత్వంలో 'మధుర స్మృతులు' అనే పుస్తకాన్ని అచ్చువేయించారు.

సాహిత్య సాగు చేస్తూ...

భాస్కర్‌రెడ్డి వివిధ అంశాలపై కవితలను రాశారు. అవి వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ● మహిళా దినోత్సవం సందర్భంగా 'తరతరాలకు వారధిగా మహిళా' కవితలు, అమ్మతనంలో కమ్మదనం, మహిళా మణి రత్నం-భాగ్యలక్ష్మీ అనే వ్యాసాలు రాశారు. ● కరోనా నేపథ్యంలో 'కరోనా జర సోచోనా, తప్పు జరిగింది, మనిషి బతుకింతేనా, సరిలేరు నాకెవ్వరూ, 'భారతావనిన నిలువదు కరోనా' కవిత రాశారు. 'చింతరెడ్డి మాట చెలిమి యాట' మకుటంతో పద్యాలురాశారు. గతంలో వివిధ సంస్థల్లో పనిచేసిన భాస్కర్‌రెడ్డి ప్రస్తుతం అక్షర జ్యోతి సాహిత్య వేదిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

మాతృభాష అభివృద్ధికి కృషి చేయాలి

ఆంగ్లంపై మమకారంతో తెలుగు భాషపై విముఖత సరికాదు. మాతృభాషపై మమకారం తగ్గడంతో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. విద్యార్థికి మాతృ భాషలోనే విద్యాబోధన జరిగితే చక్కని అవగాహనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు.ప్రభుత్వం కూడా ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలి.

చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు

సాహితీరంగంలో రాణిస్తున్న జీవా



బాలనందం పుస్తకాన్ని ఆవిష్కరించి, కవి జీవాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ఇద్దంపల్లి గ్రామానికి చెందిన సకిలినేని జీవా వృత్తిరీత్యా పెయింటింగ్ పనిచేస్తూనే పుస్తకాలు రాస్తూ సాహితీ రంగంలోనూ ముందుకు వెళ్తున్నారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని తెలుగు భాషపై మక్కువతో పుస్తకాలు, రచనలు చేస్తు ముందుకు వెళుతున్నారు. 2015లో నానీల కెరటాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. 2024 డిసెంబరులో బాలనందం పుస్తకాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

పలు సంస్థల నుంచి అవార్డులు

ఆర్టిస్టుగా, రచయితగా రాణిస్తుండడంతో సకిలినేని జీవాను పలు సంఘాలు అవార్డులతో సత్కరించాయి. 2024లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సాహిత్యరత్న జాతీయఅవార్డును తిరుపతిలో అందజేశారు. 2023 ఆగస్టులో హైదరాబాద్‌లో దళితరత్న అవార్డును అప్పటి మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి నుంచి అందుకున్నారు. 2024 డిసెంబరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును బహుజన జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ నుంచి న్యూఢిల్లీలో అందుకున్నారు. నానీల కెరటాలు పుస్తకాన్ని రచించి ప్రచురించి దేవరకొండలో కవిగా స్థానాన్ని సంపాదించారు.

ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఇవ్వాలి

తెలుగు భాషపై మక్కువతో సులభతరంగా అర్థమయ్యేరీతిలో వచన కవితలు, పుస్తకాలు రాస్తున్నా. ఇందుకు బీఆర్ అంబేడ్కర్, శ్రీశ్రీ, శ్రీనారాయణరెడ్డిలు స్ఫూర్తి. తెలుగు భాషకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే వచ్చేలా అమలుచేయాలి.

సకిలినేని జీవా, కవి, దేవరకొండ

పట్టుదలతో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

● కోచింగ్ లేకుండానే సాధించిన తరి నరేష్
● ఏడాది వయసులోనే తండ్రి మరణం
● ఆత్మస్థైర్యం కోల్పోకుండా ముందడుగు



(ఆంధ్రజ్యోతి-హాలియా)

ఏకకాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు నల్లగొండ జిల్లా అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తరి నరేష్. కడు పేద కుటుంబంలో నరేష్ ఊహ తెలియని రోజుల్లోనే తండ్రి కోల్పోయాడు. తల్లి సంరక్షణలో ప్రభుత్వ పాఠశాలలో విద్యను ప్రారంభించి ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచాడు.

తల్లి సంరక్షణలో

నరేష్ ఏడాది వయస్సులో ఉండగానే తండ్రి శ్రీనయ్యను కోల్పోయాడు. దీంతో తల్లి అంజమ్మ దిక్కుతోచని స్థితిలో నరేష్ అమ్మమ్మ స్వగ్రామం చల్మారెడ్డిగూడెనికి వచ్చి నివసిస్తోంది. కూలీ నాలీ చేస్తూ నరేష్‌ను చదువుకోవాలని ప్రోత్సహించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చల్మారెడ్డిగూడెంలోని ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10 వరకు స్థానిక, జడ్పీహెచ్ఎస్‌లో చదివాడు. అనంతరం భద్రాచలంలోని మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజనీర్ డిప్లొమా పూర్తి చేసి తర్వాత హైదరాబాద్ సీబీఐటీలో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించారు.

శిక్షణ లేకుండానే మూడు ఉద్యోగాలు

చిన్నతనం నుంచే కుటుంబ పరిస్థితిని అవగతం చేసుకున్న నరేష్ పట్టుదలతో ఎలాంటి కోచింగ్ లేకుండానే ప్రభుత్వఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ఏఈఈగా ఉద్యోగంలో చేరాడు. ఈ ఉద్యోగంతో పాటు పాలిటెక్నిక్ లెక్చరర్‌గా, తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించి అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు.

అమ్మ, తాత ప్రోత్సాహంతోనే..

నా విజయాలకు అమ్మ అంజమ్మ ప్రోత్సాహం, తాత ఏర్పుల కోటయ్య తోడ్పాటు కారణం. గురువుల ఆశీస్సులతో చిన్నతనం నుంచి నిరంతరం శ్రమిస్తూ మొక్కవోని దీక్షతో చదివా. కోచింగ్ లేకుండానే ఉద్యోగాలు సాధించగలిగా. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు.

తరి నరేష్, ఏఈఈ, జీహెచ్ఎంసీ

10 రోజుల్లో వివాహం... కానిస్టేబుల్ బలవన్మరణం

● ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారంటూ సహచరుల వద్ద ఆవేదన



అనూష(ఫైల్‌ఫొటో)

భువనగిరి టౌన్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే వివాహ నిశ్చితార్థమై.. 10 రోజుల్లో ముహూర్తం కాగా ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ, కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వర్గల్ గ్రామానికి చెందిన 2020 బ్యాచ్ ఏఆర్‌కానిస్టేబుల్ మామిడి అనూష(30) భువనగిరిలోని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తోంది. స్థానిక విద్యానగర్‌లో మరో ఇద్దరు ఏఆర్‌కానిస్టేబుల్స్‌తో కలిసి అద్దె ఇంట్లో ఉం టోంది. ఆమె కుటుంబ సభ్యులు ఈ నెల 14వ తేదీన వివాహ నిశ్చితార్థం చేసి, మార్చి 6వ తేదీన పెళ్లి ముహూర్తం నిర్ణయించారు. ఈ నెల 26 నుంచి ఆమె వివాహ సెలవులపై వెళ్లాల్సి ఉంది. మంగళవారం యథావిధిగా విధులకు వెళ్లిన ఆమె కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదంలో తండ్రి గాయపడ్డాడని పేర్కొంటూ అనుమతి తీసుకుని తాను అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లింది. ఆ కొద్దిసేపటికే ఆమె తల్లిదండ్రులు అనూషకు ఫోన్ చేశారు. ఆమె నుంచి జవాబు రాకపోవడంతో డ్యూటీలో ఉండవచ్చునని భావించారు. పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ సమాధానమివ్వకపోవడంతో అద్దె ఇంట్లో కలిసి ఉంటున్న మిగతా ఇద్దరికి ఫోన్లు చేయడంతో ప్రమాదంలో నాన్న గాయపడ్డాడని చెప్పి గదికి వెళ్లిందని సమాచారమిచ్చారు. తనకు ప్రమాదమేమీ జరగలేదని, ఉదయం నుంచే ఫోన్ సమాధానమివ్వడంలేదని కుటుంబసభ్యులు పేర్కొనడంతో సహచర సిబ్బం ది ఆమె గదికి వచ్చి కిటికీ నుంచి చూడగా ఫ్యాన్‌కు విగత జీవిగా వేలాడుతూ కనిపించింది. దీంతో తలుపులను బలవంతంగా తెరిచి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.తనకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారంటూ అనూష సహచర ఉద్యోగుల వద్ద ఆవేదన వ్యక్తంచేసేదని తెలిసింది. అనూష తల్లి మామిడి పద్మ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల వ్యాపారి ఐపీ నోటీస్

గుర్రంపోడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన చిట్టీల వ్యాపారి అప్పు చేసి 84 మందికి ఐపీ నోటీసులు పంపించాడు. మండలకేంద్రంలో కిరాణం వ్యాపారం నిర్వహిస్తూ చిట్టీల వ్యాపారం కూడా చేసేవాడు. పలువురి వద్ద అప్పుగా తీసుకొని కొంతకాలంగా చెల్లించడం లేదు. మంగళవారం గంగసాని అంజయ్య, సతీ‌ష్‌ల పేరును పోస్టు ద్వారా అందిన నోటీసుల్లో మార్చి 17న కోర్టుకు హాజరుకావాలని ఉంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

భార్యను చంపి.. భర్త ఆత్మహత్యాయత్నం



కోట్ర లక్ష్మమ్మ(ఫైల్‌ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : భార్యను హతమార్చి భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామంలో జరిగింది. సీఐ నవీన్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన కోట్ర పెద్దయ్య, లక్ష్మమ్మ(40) భార్యాభర్తలు కాగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలతో గొడవ పడుతున్నారు. సోమవారం రాత్రి భోజనం ముగించుకున్న తర్వాత కూడా గొడవపడ్డారు. తెల్లవారుజామున మూడు గంటలకు పెద్దయ్య ఇంటి ముందర వాంతులు చేసుకుంటూ ఉండడంతో కుమారుడు పవన్ వచ్చి ఏమైందని అని అడిగాడు. పురుగుల మందు తాగానని చెప్పడంతో ఇంట్లో నిద్రిస్తున్న అమ్మకు చెబుతానని పవన్ ఇంట్లోకి వెళ్లగా ఆమె మెడపై పదునైనా ఆయుధంతో బలంగా నరికిన గాట్లతో రక్తపు మడుగులో మృతి చెంది ఉంది. తల్లిని చూసి తండ్రిని నిలదీయగా 'నేను చూసుకుంటాను మీ అమ్మ గురించి వదిలేయ్' అంటూ స్పృహ కోల్పోయాడు. అది గమనించిన పవన్ చుట్టుపక్కన వాళ్లను పిలిపించి పెద్దయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దేవరకొండ మార్చురీకి తరలించారు. చిన్న కుమారుడు పవన్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నవీన్ కుమార్ తెలిపారు. పెద్దయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



కనకేశ్వరరావు(ఫైల్‌ఫొటో)

కోదాడ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న ట్రాలీ వాహనం కొమరబండ నుంచి కోదాడకు వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మంత్రిప్రగడ కనకేశ్వరరావు(55) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న కుక్కడపు పుల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. కనకేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, కుక్కడపు పుల్లయ్యను ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిరువురూ కోదాడకు చెందిన వారు కావడంతో పాటు భారతి విద్యామందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హైదరాబాద్‌లో యాదాద్రి జిల్లా వాసులు..



చంద్రశేఖర్,మత్స్యగిరి(ఫైల్‌ఫొటోలు)

కీసర రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ప్రమాద స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. ఈ ఘటన సోమవారం రాత్రి మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌గూడెంకు చెందిన గూడూరు చంద్రశేఖర్(32), అతడి తమ్ముడు మత్స్యగిరి(27) ఉపాధి కోసం నగరానికి వలసొచ్చారు. చంద్రశేఖర్ దర్జీ పనిచేసుకుంటూ తార్నాకలో, మత్స్యగిరి విజయ డెయిరీలో ఉద్యోగం చేసుకుంటూ లాలాగూడలో ఉంటున్నారు. సోమవారం వీరిద్దరూ తమ అల్లుడు శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపైన దమ్మాయిగూడ మునిసిపాలిటీ యాద్గార్‌పల్లిలోని బంధువుల ఇంటికి చేరుకున్నారు. పని ముగించుకుని తిరిగి వస్తూ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు గుండా యాద్గార్‌పల్లి-చీర్యాల ప్రాంతానికి చేరుకున్నారు. ఎదురుగా వచ్చిన కారు వేగంగా బైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురూ రోడ్డుపైన పడిపోగా తీవ్రగాయాలతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మత్స్యగిరి, శ్రీనులను గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మత్స్యగిరి చనిపోయాడు. శ్రీను చికిత్స పొందుతున్నాడు. మృతులిద్దరూ తోడబుట్టిన అన్నదమ్ములు. కాగా మత్స్యగిరి పెళ్లి వచ్చే నెల 20న జరగాల్సి ఉంది. చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

60 అడుగుల గోతిలో పడ్డ టిప్పర్

● మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కార్మికులు మృతి



60 అడుగుల నుంచి పడిపోయిన టిప్పర్

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడి నుంచో జీవనోపాధి కోసం వచ్చి ఇద్దరు బడుగు జీవులు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో జరిగింది. ఎస్ఐ రజినికర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు శ్రీనివాసపురంలోని వేంకటేశ్వర క్రషర్ మిల్లులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున లోడుకోసం టిప్పర్ లారీ వెళ్తున్న క్రమంలో సుమారు 60 అడుగుల లోతులో ఉన్న క్వారీలోకి అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రహ్లాద్‌సింగ్(19), హెల్పర్‌గా పనిచేస్తున్న సందీప్ సింగ్(19) అక్కడికక్కడే మృతి చెందగా, మరొక హెల్పర్ లోకేష్‌సింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. లోకేష్‌కు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రహ్లాద్, సందీప్ సింగ్ మృతదేహాలను ఆలేరులోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం కోసం తరలించారు. వీరంతా అవివాహితులే. ఈ విషయపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా అనుమతి లేకుండా కంకర మిల్లును నడిపిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్, మంత్రులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. క్రషర్స్‌తో వచ్చే దుమ్ము, ధూళితో పంటలు సైతం దెబ్బతింటున్నాయని, ఇళ్లు బీటలు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

నిడమనూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఆయనను చంపేసి చెట్టుకు ఉరేశారని ఆరోపిస్తూ గ్రామస్థులతో కలిసి కుటుంబ సభ్యులు క్వారీ ముందు ఆందోళనకు దిగారు. మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బంటువారిగూడెంలో మంగళవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బిల్లకంటి వెంకన్న(60) గతంలో ఎర్రబెల్లి క్వారీలో క్యాంటీన్ నడుపుతూ జీవనం సాగించేవాడు. గత నెల 22న క్వారీ ఆవరణలో చెట్టుకు ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. వెంకన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేశారు. వెంకన్న మృతి చెంది నెల రోజులు దాటినా కేసులో పురోగతి లేకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులతో కలిసి మంగళవారం క్వారీ ఎదుట ఆందోళనకు దిగారు. కార్యాలయానికి తాళం వేసి క్వారీలోని వర్కర్లను బయటకు పంపించారు. క్వారీ గేటుకు అడ్డంగా కంపచెట్లు ఉంచి ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి బాధితులతో మాట్లాడి తాళం తీసి కంపచెట్లు తొలగించాలని కోరారు. అందుకు ససేమిరా అనడంతో పాటు వెంకన్నను అన్యాయంగా చంపేసి చెట్టుకు ఉరేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. క్వారీలోని సీసీ టీవీ పుటేజీని క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. పుటేజీలో అపరిచిత వ్యక్తి కదలికలు ఉండటంతో మృతిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. క్వారీ యజమాని వచ్చేవరకు తాళం తీసేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఎస్ఐ గోపాల్‌రావు క్వారీ యజమానితో ఫోన్‌లో మాట్లాడగా శుక్రవారం వస్తానని చెప్పినప్పటికీ, ఈరోజే రావాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులకు పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించడంతో పోలీసులు వెనుదిరిగారు. ఎస్ఐ గోపాల్‌రావు మాట్లాడుతూ వెంకన్న మృతి కేసును అనుమానాస్పద మృతి గానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక, ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఇంతవరకూ రాలేదని తెలిపారు. సీసీ పుటేజీ కూడా మృతుడి కుటుంబ సభ్యులకు ఇచ్చినట్లు తెలిపారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ గుండెబోయిన రాంబాబు, మెరుగు రామలింగయ్య, మట్టయ్య, కృష్ణ, కోదండచరణ్‌రాజ్, అంజయ్య తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉన్న ఆందోళనకారులు ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నిజాయితీగా బ్రాస్‌లెట్ అప్పగించాడు



గణేష్‌కు బ్రాస్‌లెట్ అందజేస్తున్న అశోక్

చిట్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన ఓ క్షురకుడు ఒకటి, రెండు కాదు ఏకంగా రూ.3.5 లక్షల విలువైన బంగారు బ్రాస్‌లెట్‌ను అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన గుర్రం గణేష్ సోమవారం చిట్యాలలో బంధువుల శుభకార్యానికి వచ్చాడు. అక్కడికి వెళ్లే ముందు పట్టణంలోని భువనగిరి రోడ్డులోని బీజేపీ నాయకుడు చికిలంమెట్ల అశోక్‌కు చెందిన పూజిత హెయిర్ కటింగ్ సెలూన్‌లో గడ్డం చేయించుకున్నాడు. ఆ సమయంలో అతడి చేతికున్న నాలుగున్నర తులాల బంగారు బ్రాస్‌లెట్ పడిపోయింది. అతడు వెళ్లిన తరువాత గమనించిన అశోక్ అతడి ఫోన్‌నెంబర్ లేకపోవడంతో దానిని తీసి భద్రపరిచాడు. సోమవారం రాత్రి ఇంటికి వెళ్లిన తరువాత బ్రాస్‌లెట్‌పోయిన విషయం గుర్తించి మంగళవారం ఉదయాన్నే చిట్యాలకు వచ్చి ఫంక్షన్‌హాల్‌లో వెతికినా దొరకలేదు. చివరగా హెయిర్‌కటింగ్ సెలూన్‌కు వచ్చి అశోక్‌ను అడగ్గా అది తన వద్దే ఉందని తీసి ఇచ్చాడు. పోయిందనుకున్న బ్రాస్‌లెట్ దొరకడంతో గణేష్‌తో పాటు అతడి కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. అశోక్‌ను గణేష్ కుటుంబ సభ్యులతో పాటు పక్కషాపుల వారు అభినందించారు. కార్యక్రమంలో పాల మహేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టిస్తూ అధిక ధరకు విక్రయిస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా సాగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం రెండు గంట సమయంలో నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌ల ఆధ్వర్యంలో వాహన తనిఖీఉ నిర్వహిస్తున్నారు. తిరుమలగిరి(సాగర్) మండలం చింతలపాలెం వైపు నుంచి వెళ్తున్న ఏపీ39వై5943 వాహనాన్ని తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వాహనం నుంచి దూకి పారిపోయాడు. దీంతో వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తిరుమలగిరి(సాగర్) మండలం చిల్కాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ మనమాల నరసింహ, గరికేనట్‌తండా డీలర్ సపావత్ విజయ్‌లు ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అధిక ధరకు అదే మండలం నాయకుడితండాకు చెందిన దేవ్లా, చింతలపాలెంకు చెందిన నాగరాజుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఏపీలో బియ్యం వ్యాపారులైన తిరువాయిపాటి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు కొంతకాలంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసిన అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం దేవ్లా, నాగరాజులు డీలర్ నరసింహ వద్ద 50 బస్తాలు, గరికేనట్‌తండా డీలర్ విజయ వద్ద 30 బస్తాల బియ్యం కొనుగోలు చేసి వాహనంలో తరలిస్తుండగా పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. వాహనం డ్రైవర్ బ్రహ్మంరాజు, దుర్గికి చెందిన వెంకటేశ్వర్లు, డీలర్ నరసింహలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. తనిఖీల్లో మొత్తం 39.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 80 గన్నీబ్యాగులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించడంలో సహకరించిన ఏఎస్ఐ గురునాథం, హెచ్‌సీ శంకర్‌బాబు, వెంకటేశ్వర్లు, రాంకోటి, జావిద్, సురేష్, నరసింహలను డీఎస్పీ అభినందించారు.

దాచారం రామాలయంలో విగ్రహాల అపహరణ



దాచారంలో చోరీకి గురైన విగ్రహాలు(ఫైల్‌ఫొటో)

మోత్కూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దాచారం రామాలయంలో సోమవారం రాత్రి గర్భగుడి తాళం విరగ్గొట్టి శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత, రంగనాథస్వామి విగ్రహాలను ఎత్తుకెళ్లారు. ఎస్ఐ నాగరాజు, ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం స్వీపర్ ఆలయ ప్రాంగణాన్ని ఊడ్చేందుకు వెళ్లగా గర్భగుడి తలుపులు తెరిచి ఉన్నాయి. ఆ విషయాన్ని వెంటనే పూజారికి చెప్పగా ఆయన వెళ్లి చూసే సరికి గర్భగుడిలో విగ్రహాలు లేవు. ఆ నాలుగు విగ్రహాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. శ్రీనివాసాచార్యులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామన్నారు.

ఇది నాలుగోసారి...

దాచారం రామాలయం నుంచి విగ్రహాలు చోరీకి గురికావడం ఇది నాలుగోసారి. మొదట పంచలోహ విగ్రహాలు ఉండేవి. రెండు పర్యాయాలు చోరీకి గురైనప్పుడు విగ్రహాలు తిరిగి దొరికాయి. మూడోసారి చోరీకి గురైన విగ్రహాలు దొరకలేదు. దాంతో ఇత్తడి విగ్రహాలు చేయించి ప్రతిష్ఠించారు. ఇప్పుడు వాటినీ ఎత్తుకెళ్లారు. డబ్బుకు కక్కుర్తి పడి విగ్రహాల చోరీకి పాల్పడమేమిటని గ్రామస్థులు వాపోతున్నారు. పోలీసులు దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ లైన్‌మన్‌పై దాడి, కేసు నమోదు

చౌటుప్పల్‌రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ తంగెడపల్లిలో విద్యుత్‌లైన్‌మన్‌పై వినియోగదారుడు మంగళవారం దాడి చేసి గాయపరిచాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం తంగెడపల్లికి చెందిన దేశగోని మల్లేశ్‌గౌడ్ ఇంటి వద్ద విద్యుత్ బిల్లులు వసూలు చేయడానికి వెళ్లిన లైన్‌మన్ పబ్బతిరెడ్డి రాంరెడ్డిపై మల్లేశ్‌గౌడ్ కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు లైన్‌మన్ రాంరెడ్డి ఫిర్యాదు మేరకు మల్లేశ్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్‌వైర్లు ఎత్తుకెళ్లిన దొంగలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో వ్యవసాయ బావుల వద్ద మోటారు వైర్లు చోరీకి గురయ్యాయి. మండల కేంద్రంలో యాస లింగారెడ్డి, యాస వెంకట్‌రెడ్డిలకు చెందిన వ్యవసాయ బావుల వద్ద స్టార్టర్ల నుంచి మోటారు పంపు వరకు ఉండే విద్యుత్ వైర్లు సుమారు 60 మీటర్ల మేర సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఒక వైపు బోర్లల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే, మరో వైపు దొంగలు వైర్లు ఎత్తుకెళ్లడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చేనేత వస్త్ర తయారీ పరిశీలనకు క్షేత్రపర్యటన

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్టార్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని హైదరాబాద్‌లోని ప్రగతి డిగ్రీ ఉమెన్స్ కళాశాలకు చెందిన 180 మంది విద్యార్థినులు సందర్శించారు. చేనేత వస్త్ర తయారీ ప్రక్రియల పరిశీలన కోసం వచ్చినట్లు వారు తెలిపారు. పట్టణంలోని గ్రామీణ పర్యాటక కేంద్రంలోని మ్యూజియం సందర్శించారు. లీవ్‌టుక్లాత్ ప్రాసెసింగ్‌యూనిట్ సందర్శించిన విద్యార్థులు చేనేత టైఅండ్‌డై వస్త్ర తయారీ ప్రక్రియలను వారు పరిశీలించారు. వారి వెంట స్టార్స్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అజయ్‌కుమార్, ప్రతినిధులు ఆరిఫ్, హస్నం, ఆజామ్, అధ్యాపకులు కృష్ణవేణి, అనూరాద, అమృత, చయంద్రావతి, గైడ్ గోనిగంటి సుభాష్ ఉన్నారు.

ఉషు క్రీడలో రాణించడం అభినందనీయం



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు

భువనగిరి (కలెక్టరేట్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉషు క్రీడలో రాణించడం అభినందనీయమని యాదాద్రిభువనగిరి జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు అన్నారు. ఖేలో ఇండియా అభియాన్‌లో భాగంగా ఈ నెల 19వ తేదీన ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన ఉమెన్స్ ఉషు లీగ్ 2024-25(సండా) పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. క్రీడాకారులు, కోచ్ సందీప్‌ను మంగళవారం తన కార్యాలయంలో సన్మానించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించిన జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తేవాలని కోరారు. ఉమెన్స్ ఉషు లీగ్‌లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో జరిగిన పోటీల్లో సబ్ జూనియర్ కేటగిరిలో ఏ. సోనాక్షి విజ్ఞ(బంగారు), డీ. కృతిక(రజత), జూనియర్ విభాగంలో టీ. వర్షిణీ, (రజత), డీ. ఉమ, ఏ. రితిక(కాంస్యం), సీనియర్ విభాగంలో డీ. యమునా గౌడ్(బంగారు) పతకాలు సాధించారు.

తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న కుర్మేడ్ గ్రామస్థులు

చింతపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని నల్లగొండ చింతపల్లి మండలం కుర్మేడ్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా సక్రమంగా సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు మంగళవారం సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తుండడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు వాపోయారు. వేసవి కాలం కావడంతో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. రాస్తారోకోతో అరగంట పాటు ట్రాఫిక్ జాం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనచేస్తున్న వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింజేయించారు.

'సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారు'

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలో గల పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపు కారణంగా సమీపంలోని గుడితండా పూర్తిగా ముంపునకు గురికానుంది. తండాలోని 403 ఇళ్లకు పునరావాసం కింద నగదు చెల్లించేందుకు జిల్లా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏడాది క్రితం అధికారులు సర్వే చేశారు. ఈ క్రమంలో తండావాసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మంగళవారం మధ్యాహ్నం తండాలో సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు వచ్చిన సమయంలో తండావాసులు పొలం పనులకు వెళ్లిపోయారు. దీంతో ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారంటూ పలువురు అధికారులను ప్రశ్నించారు. గంట సేపు వేచి చూసిన అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా తండాకు చెందిన రమేష్ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల తీరుతో ముంపు నిర్వాసితులకు అన్యాయం జరుగుతోందన్నారు. పారదర్శకంగా సర్వే చేపట్టకపోవడంతో పలువురు నష్టపోయారని తెలిపారు. ఈ విషయమై ఎస్డీసీ ఆర్‌ఐ అశ్వినిని వివరణ కోరగా విషయాన్ని దాటవేయడంతో పాటు సమాచారం చెప్పటానికి విముఖత వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ హుస్సేన్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు.

నిర్వాసితుల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

నాంపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని స్వాముల వారి లింగోటం గ్రామ పంచాయతీలోని లక్ష్మణాపురం గ్రామంలో నిర్మిస్తున్న కిష్టరాయినిపెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులు రెండు రోజులుగా పనులను అడ్డుకోగా మంగళవారం భూ నిర్వాసితులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. రిజర్వాయర్ ప్రారంభ సమయంలో అప్పటి ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రా రంభ సమయంలో రూ.1,26,100 ఇస్తామని హామీ ఇచ్చి రూ.76,100 మాత్రమే ఇచ్చిందని భూ నిర్వాసితులు అన్నారు. మిగతా ఐదు లక్షలు ఇవ్వాలని, సర్వే చేయని ఇళ్లను మళ్లీ సర్వే చేసి వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. 327 సర్వేనెంబర్‌లో ఉన్న 40ఎకరాలకు సంబంధిత రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. 2017 నుంచి 2025 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మీ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవాసింగ్, ఇరిగేషన్ అధికారులు సతీష్, శివ, భూ నిర్వాసితులు గట్టుపల్లి నర్సిరెడ్డి, బడిగా శ్రీనివాస్, గడ్డి వెంకటయ్య, దుగ్గి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలికి ముహూర్తం కుదిరేనా?

చర్చ

- పాలకమండలి లేకుండానే 15ఏళ్లుగా గుట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణ
- మొన్నటి సీఎం క్షేత్ర పర్యటన లోనూ రాని ప్రకటన
- నోటిఫికేషన్లకే పరిమితం



భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి పాలకమండలి లేకుండానే ఈ ఏడాది కూడా వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నెల 23వ తేదీన క్షేత్ర పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పాలకమండలి నియామకంపై ప్రకటన చేస్తారని ఆశావాహులు ఆశలు పెంచుకున్నారు. ఎన్నికల కోడ్ విధించినందున కనీసం అధికారులకు మౌఖిక ఆదేశాలు కూడా ఇవ్వలేదు. సీఎం నోట తీపి కబురు ఆశించిన ఆశావాహులకు నిరాశే ఎదురైంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే వచ్చే నెల 8న పాలక మండలి ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోంది. 15 ఏళ్లుగా ధర్మకర్తల మండలి లేకుండానే ఆలయ పాలనా వ్యవహారాలు కొనసాగాయి. పాలకమండలిని నియమించేందుకు ప్రస్తుత ప్రభుత్వం యోచించినా ఎన్నికల కోడ్ ఉండడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం పాలనా పరంగా సాంకేతిక సమస్యలను అనువంశిక ధర్మకర్త పేరిట అధికారులే అభివృద్ధి, ఆచార, వ్యవహారాలు చక్కబెడుతున్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్లు, తర్వాత స్వరాష్ట్రంలో పదేళ్లు కావస్తున్నా ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమించలేదు. 15 ఏళ్లల్లో పాలక మండలిని నియమించేందుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్లు జారీ చేయడం, ఆశావాహులు దరఖాస్తు చేసుకోవడం పరిపాటిగా మారాయి.

నోటిఫికేషన్లకే పరిమితం

ధర్మకర్తల మండలి నియామకం కోసం నోటిఫికేషన్లతోనే సరిపెడు తున్నారు. 15ఏళ్లుగా దాదాపు అరడజను సార్లు దేవాదాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్లతోనే కాలం గడిచిపోతోంది. నోటిఫికేషన్లు జారీ చేసిన ప్రతిసారీ అధికార పార్టీల్లోని ఆశావాహుల్లో ఆశలు రేకెత్తి మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్దఎత్తున ప్రయత్నాలు సాగించడం శరమాములుగా మారింది. తెలంగాణ హిందూ ధర్మ సంస్థలు, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ చట్టం 30/1987, సవరణ/2000 ప్రకారం ముఖ్యమంత్రి ధర్మకర్తల మండలిని నియమిస్తారు. దేవాదాయ శాఖ సిఫారసుల మేరకు ముఖ్యమంత్రి మండలి సభ్యులను నియమిస్తారు. అనువంశిక ధర్మకర్తతో 20మంది సభ్యులను ప్రభుత్వం నియమించనున్నట్లు ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ కులాలు, మహిళ, బలహీన వర్గాలకు చెందిన ఒక్కొక్కరికి తప్పని సరి ప్రాతినిధ్యం ఉండాలి. రెండేళ్ల పదవీకాలంతో మండలి కొనసాగాలి. చట్టం ప్రకారం ధార్మిక కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న వారిని సభ్యులుగా నియమించాలి.

2009లోనే ముగిసిన పాలకమండలి గడువు

ఏడాదికి రూ.230 కోట్ల ఆదాయం సమకూరుతున్న ఆలయానికి పా లక మండలి నియమించాలని ప్రభుత్వం యోచించింది. అమలు సాధ్యం కాక అధికారుల పాత్రతోనే 15 సార్లు వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పన, వివిధ ఉత్సవాల నిర్వహణ వంటి అంశాలపై నిర్ణయం, అమలులో ధర్మకర్తల మండలి పాత్ర కీలకమైంది. దేవాదాయ చట్టం ప్రకారం ఆలయ పాలనా వ్యవహారాల్లో ధర్మకర్తల మండలి పదవీకాలం 2009 నవంబరు 18న ముగిసింది.

అనువంశిక ధర్మకర్తతోనే ఆలయ పాలన

దేవాదాయ చట్టం మేరకు ఆలయాల్లో కీలక నిర్ణయాలు, అమలుకు ధర్మకర్తల మండలి ఆమోదం తప్పని సరి. 2009 నవంబరు 18న యాదగిరిగుట్ట ధర్మకర్తల మండలి పదవీ కాలం ముగిసిన తర్వాత అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తితోనే ఆలయ పాలన సాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంతో ఆలయాన్ని సుమారు రూ.1200కోట్ల వ్యయంతో 14ఎకరాల్లో పూర్తి కృష్ణశిలల రాయితో నిర్మించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చైర్మన్‌గా, జిల్లామంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు జిల్లా అధికారులు సభ్యులుగా వైటీడీఏ పేరుతో పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. కానీ, చట్ట ప్రకారం ఏర్పాటు చేయాల్సిన ధర్మకర్తల మండలి మాత్రం నియమించలేదు.

అఖండజ్యోతి, విగ్రహాలు వైకుంఠద్వారం వద్ద ఉంచాలి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహోత్సవాలకు హైదరాబాద్ బర్కత్‌పు నుంచి భారీ వాహనంలో అఖండజ్యోతితో పాటు స్వామి అమ్మవారి విగ్రహాలను తీసుకొస్తారు. మూడు దశాబ్దాలుగా అఖండజ్యోతి కమిటీసభ్యుల కృషితో వార్షిక బ్రహోత్సవాల ప్రారంభం రోజు యాదగిరిగుట్టకు చేరుకోవడం దారి పొడవున స్వామివారికి మంగళహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ వస్తోంది. ఇక్కడికి తెచ్చిన విగ్రహాలను నిర్వాహకులు తిరిగి హైదరాబాద్‌కే తీసుకెళ్తున్నారు. పూజలు అందుకున్న స్వామివారి విగ్రహాలను వైకుంఠద్వారం చెంత నిలపాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ పునర్నిర్మాణం కంటే ముందు చెక్‌పోస్టు ఎదురుగా వాహన పూజల షెడ్‌లో అధికారుల అనుమతితో ప్రతిష్టించే వారు. కాలక్రమేణ ఆలయ పునర్నిర్మాణంలో నిలిపేందుకు స్థలాభావం ఏర్పడింది. ఈ అంశంపై ఆలయ అధికారులు ఇప్పటి వరకు కనీసం స్థలాన్ని ఎక్కడా కేటాయించలేదు. దీంతో అఖండజ్యోతిని నిర్వాహకులే తిరిగి తీసుకెళ్తున్నారు. గిరిప్రదక్షిణ మహోత్సవం ఇక్కడి నుంచే ప్రారంభమవుతుండగా స్వామివారిని మొక్కులు చెల్లించేందుకు ఇక్కడ ఎలాంటి విగ్రహాలను అధికారులు ఏర్పాటు చేయలేదు. అఖండజ్యోతితో వచ్చిన స్వామిఅమ్మవారి విగ్రహాలను దర్శించుకేందుకు వైకుంఠద్వారం చెంత నిలపాలని భక్తులు కోరుతున్నారు.

నేత్రపర్వంగా పార్వతీ పరమేశ్వరుల పరిణయం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరిఅర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరుడి శివరాత్రి మహోత్సవాల్లో మూడోరోజు మంగళవారం ఉదయం 10 గంటలకు యాగశాలలో రుద్రహవనం, రాత్రి 7గంటలకు పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి పరిణయ మహోత్సవ వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. పరమేశ్వరుడికి నిత్యపూజలు, ఆలయ మండపంలో కలశారాధనలు, మూలమంత్ర, చతుర్వేద పఠనాలు, మండపారాధనలు, శైవసంప్రదాయ రీతిలో నిర్వహించారు. రుద్రవాహనం అపమృత్యు నివారకమని, పరమేశ్వరుడికి ఇష్టమైన వేడుకని పురోహితులు వివరించారు. సాయంత్రం సోమ కుంభార్చనలు, నిత్య కైంకర్యాలు చేపట్టిన అర్చకులు పార్వతీ, పరమేశ్వరులను పట్టు వస్త్రాలు, ముత్యాలు బంగారు ఆభరణాలు, సుగంధ భరితమైన పూలమాలలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం నిర్వహించారు. ముక్కంటికి అలంకార సేవను వేద మంత్రాలతో వేదికపై తీర్చిదిద్ది షోడషోపచార పూజలు నిర్వహించారు. వేదపండితుల, పురోహిత బృందం ముందుగా విష్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణతంతు ఆరం భించారు. స్వామికి యజ్ఞోపవీతధారణ జరిపి జీలకర్రబెల్లం, లగ్నాష్టకాలు, మాంగల్య పూజ పర్వాలను నిర్వహించారు. పండితుల వేద మంత్రాల పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల, భక్తుల జయజయ ధ్వానాలు, హరహర నామస్మరణల నడుమ రామలింగేశ్వరుడు పార్వతీ అమ్మవారి మెడలో మాంగళ్యధారణ ధారణ వేడుకలు శోభాయమానంగా సాగింది. దేవస్థాన ఈవో ఏ. భాస్కర్‌రావు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేడుకలను శివాలయ ప్రధానార్చకులు గౌరీభట్ల నర్సింహాచార్యులు, సిద్ధాంతి గౌరీభట్ల సత్యనారాయణశర్మ, పురోహిత బృందం, రుత్వికులు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి. నర్సింహ్మామూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వెల్లి రమేష్‌బాబు, రఘు, దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకులు దీరావత్ రామరావునాయక్, పాల్గొన్నారు.

మహోత్సవంలో నేడు

శివరాత్రి మహోత్సవాల్లో బుధవారం మహా శివరాత్రిని పురస్కరించుకొని రుద్రాభిషేకములు, రాత్రి లింగోద్భవ కాలమున మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేక పూజలు కొనసాగుతాయి.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమల పాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొల్పి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు.

పరంజా తొలగింపు

స్వర్ణగోపురం చేరుకునేందుకు ఆలయ దక్షిణ తిరువీధి నుంచి ఆలయం పైకి, అక్కడి నుంచి ఐదంతస్తుల పంచతల స్వర్ణ విమాన రాజగోపురం ఎక్కేందుకు తరాంజను ఏర్పాటు చేశారు. స్వర్ణ గోపుర ఆవిష్కరణ ప్రక్రియ పూర్తయినందున మంగళవారం పరాంజాను తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలు శ్రమించి తొలగించారు.

అందని నీరు.. ఆందోళనలో రైతులు



డిస్ట్రిబ్యూటరీ కాల్వను పరిశీలిస్తున్న ఏఈఈ మమత

కేతేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మూసీ కుడికాల్వ ఆయకట్టులోని 9వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ పరిధిలో గల సాగు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో భాగ్యనగర్ సమీపంలోని కొప్పోలు రెగ్యులేటరీ వద్ద నుంచి కుడి ప్రధాన కాల్వ రిడ్జ్‌కెనాల్ పేరిట రెండుగా చీలుతుంది. ఒకటి చెరుకుపల్లి, తుంగతుర్తి, ఎల్లమ్మగూడెం, చిరుమర్తి వైపు వెళుతుండగా, మరొకటి కొప్పోలు, భీమారం, మాడ్గులపల్లి మండలంలోని పాములపహాడ్ వైపు వెళుతోంది. భీమారం వైపు వెళ్లే రిడ్జ్‌కెనాల్‌పైన 8, 9నెంబరు డిస్ట్రిబ్యూటరీలున్నాయి. కొప్పోలు రెగ్యులేటరీ వద్ద నుంచి భీమారం వచ్చే కాల్వకు కుడి ప్రధాన కాల్వలో గల రిడ్జ్ జంక్షన్ నుంచి నీటి విడుదల తక్కువగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ రిడ్జ్‌కెనాల్‌కు అరకొరగా వచ్చే నీరు పాములపహాడ్ వైపునకు వెళ్లే 8వ నెంబరు డిస్ట్రిబ్యూటరీకి ఎక్కువ మోతాదులో నీరు వెళ్లేలా అక్కడి రైతులు అక్రమంగా ఏర్పాట్లు చేసుకున్నట్లు విమర్శలున్నాయి. ఈ క్రమంలో భీమారం వైపునకు నీటిని అందించే 9వ నెంబరు డిస్ట్రిబ్యూటరీకి తగినంత నీరు అందడంలేదని కొన్ని రోజులుగా భీమారం రైతులు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మూసీ కుడి కాల్వ ఏఈఈ మమత స్థానిక రైతులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. 9వ నెంబరు డిస్ట్రిబ్యూటరీ కాల్వకు మూసీ నీరు సక్రమంగా రాక ఎండిన తమ పంట పొలాలను రైతులు మూసీ కుడికాల్వ ఏఈఈ మమతకు చూపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది పంట కాలం పూర్తయ్యే వరకూ చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఏఈని కోరారు. కాల్వలో నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించే కొందరు సిబ్బంది నిర్లక్ష్యంతో తమ పంటలు ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ ఉంటే తమకు ఎలాంటి సమస్య ఎదురుకాదన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాల్వలో నీరు ప్రవహించక పంటలు ఎండిన తీరును గమనించిన ఏఈ మమత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 9వ నెంబరు డిస్ట్రిబ్యూటరీకి నిర్ణీత మోతాదులో నీరు వచ్చేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఏఈ వెంట స్థానిక నాయకులు బడుగుల నరేందర్‌యాదవ్, రైతులు జిల్లల యాదగిరి, బాలకృష్ణ, గండికోట గోపాల్, కొరివి బాలస్వామి, జిల్లెల వెంకన్న ఉన్నారు.

ప్రలోభాల పర్వం

(3వ పేజీ తరువాయి)

ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్‌టీయూ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సం ఘాల మద్దతుతో బరిలో దిగిన మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ తరఫున వారికి మద్దతిచ్చే సంఘాలు, పార్టీలు, ప్రతినిధులు ఓట్లకోసం చివరివరకు ప్రయత్నాలు చేశారు. మొత్తం 25,797 ఓట్లలో సగం ఓట్ల వరకు సంఘాల వారీగా, అభ్యర్థుల వారీగా స్థిరమైన ఓటుబ్యాంక్‌గా ఉంటాయని, వీటిలో దాదాపు హైస్కూల్ ఓట్లే 90శాతం వరకు ఉంటాయని భావిస్తున్నారు. మిగిలిన దాదాపు 12వేల ఓట్లలో ఎక్కువభాగం మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎవరు సాధిస్తే వారికి విజయావకాశాలు మెరుగ్గా ఉండనుండడంతో ఆ ఓట్లకోసం అభ్యర్థులంతా కృషి చేశారు. ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, కేజీబీవీ టీచర్లు, గురుకులాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతోపాటు రికగ్నైజ్ట్ స్కూళ్ల టీచర్ల ఓట్లు ఇందులో ఉన్నాయని, వీరిలో ఎక్కువ వాటా ఎవరు సాధిస్తే వారికి అవకాశాలు మెరుగవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ఓట్లన్నీ గంపగుత్తగా ఎవరికీ పడే అవకాశాలు కనిపించడం లేదని చెబుతున్నారు. అభ్యర్థులు ఈ ఓట్లకోసం తీవ్రంగా శ్రమించి వీరి ఓట్లకోసమే ప్రత్యేకంగా ప్రచారం సైతం నిర్వహించారు. చివరికి వీరు ఎవరిని కరుణిస్తే వారే విజేతలయ్యే పరిస్థితి నెలకొనడంతో సంఘాల పరపతి, బీసీ వాదం, ప్రభుత్వంలో పరపతి, ఉపాధ్యాయులకోసం పోరాడే స్వభావాన్ని ఆయా ఓటర్లకు వివరిస్తున్న అభ్యర్థులు వారిని తమవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అందరి వాదనలు, సిద్ధాంతాలు, అభ్యర్థనలు వింటోన్న ఈ ఉపాధ్యాయులు చివరికి ఎటు మొగ్గు చూపుతారనే దానిపైనే అందరి దృష్టి నెలకొంది.

ముగిసిన ప్రచారఘట్టం

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం వరకు ప్రచారం ముగిసింది. ప్రధాన అభ్యర్థులు, వారి తరఫున ప్రచారం చేస్తున్న సంఘాలు, రాజకీయ ప్రతినిధులు మంగళవారం సాయంత్రానికి ఎక్కడివారక్కడే ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు. చివరి నిమిషం వరకు ఆయా అభ్యర్థుల తరఫున వారి ప్రతినిధులు ఓటర్లను కలిసి తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటేయాలని అభ్యర్థించారు. మోడల్ బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 25,797మంది ఓటర్లు నమోదయ్యారు. నల్లగొండ జిల్లాలో 4,683 ఓటర్లకు 37 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, సూర్యాపేట జిల్లాలో 2,664 మంది ఓటర్లకు గాను 23 పోలింగ్ స్టేషన్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 984 మంది ఓటర్లకు గాను 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఉమ్మడి జిల్లాలో సైలెన్స్ పీరియడ్‌ని అమల్లోకి తెచ్చారు. మద్యం దుకాణాలకు తాళాలువేశారు. ఈ పీరియడ్‌లో ప్రచారం, సోషల్‌మీడియాలో సైతం పోస్టులు పెట్టడం వంటి పనులు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణకు 600మంది సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ వెల్లడించారు. జిల్లాలో ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకూ బీఎన్ఎస్ఎస్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు, ప్రతినిధులు జిల్లా విడిచివెళ్లిపోవాలని సూచించారు.

గుర్రంపోడు తహసీల్దార్, మఠంపల్లి ఎంపీడీవో సస్పెన్షన్

● విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వేటు వేసిన నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు ● బొమ్మలరామారం గ్రామ కార్యదర్శిపై వేటువేసిన యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్

గుర్రంపోడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన నల్లగొండ జిల్లా గుర్రంపోడు తహసీల్దార్ జి. కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్ విజ్ఞప్తి మేరకు గతనెల 6 నుంచి 16వ తేదీ వరకు కలెక్టర్ సెలవులు మంజూరు చేశారు. సెలవు ముగిసిన తర్వాత జనవరి 17న విధుల్లో చేరాల్సి ఉండగా, కిరణ్‌కుమార్ విధుల్లో చేరకుండా సెలవును జనవరి 31వరకు పొడిగించారు. మరోసారి ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు సెలవును పొడగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాల కింద లబ్ధిదారుల ఎంపికతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీచేసిన నేపథ్యంలో కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు సెలవు మంజూరు చేయలేదు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ఆదేశాలను బేఖాతరు చేసినందుకు వివరణ ఇవ్వాలని తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయినప్పటికీ ఫిబ్రవరి 25వరకు తహసీల్దార్ విధుల్లో చేరకపోవడమే కాకుండా, ఎలాంటి సమాచారం ఇవ్వకపోడం, స్పందించకపోవడంవల్ల ప్రభుత్వ పథకాల అమల్లో జిల్లా యంత్రాంగానికి తీవ్ర ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో సెలవులో ఉన్న గుర్రంపోడు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు..

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి ఎంపీడీవో, ఎంపీవోతో పాటు కిందితండా గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే వ్యవహారంలో అత్యుత్సాహం చూపిన ముగ్గురు కార్యదర్శులను డీపీవో ఆఫీస్‌కు అటాచ్ చేశారు. మఠంపల్లి మండలంలోని కిందితండా గ్రామంలో ఓటర్ల జాబితలో అధికారులు వార్డులను సక్రమంగా ఎంపిక చేయలేదని, చెన్నాయిపాలెం పంచాయతీకి సంబంధించిన 40ఓట్లను కింది తండాలో చేర్చారని తండాకు చెందిన భూక్య బాబురావునాయక్‌తో పాటు స్థానిక నేతలు గత సంవత్సరం నవంబరు 28న ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎన్నికల కమిషన్ కిందితండా ఓటర్ల జాబితాను పరిశీలించాలని మండలస్థాయి అధికారులను ఆదేశాలు జారీచేశారు. దీంతో ఎంపీడీవో కొంత మంది కార్యదర్శులతో నామమంత్రంగా విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి, అధికారుల నిర్లక్ష్యం చేసి తప్పుడు నివేదిక ఇచ్చారని రెండోసారి స్థానిక నేతలు గత సంవత్సరం డిసెంబరు 13న ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎన్నికల అధికారులు మరోమారు విచారణకు డీఎల్‌పీవో ఆధ్వర్యంలో ఎంపీడీవో బానాల శ్రీనివాస్, ఎంపీవో నరేష్, పంచాయతీ కార్యదర్శి బాలసైదులుతో పాటు మరో 10మంది కార్యదర్శులతో కిందితండాలో విచారణ చేపట్టారు. ఓటర్ల జాబితా సక్రమంగానే ఉందని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేయకుండా తప్పుడు నివేదిక ఇచ్చారని, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని, పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని జనవరి 6, ఫిబ్రవరి 8న రెండోసారి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ క్షేత్రస్థాయిలో వాస్తవ అవాస్తవాలను తెలుసుకొని అధికారులు విచారణలో పంపిన తుది ఓటర్ల జాబితాను పరిశీలించగా అవకతవకలు జరిగాయని గుర్తించి అందుకు బాధ్యులైన ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శితో పాటు విచారణలో సహకరించిన మరో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు ఇదే మండలంలో పనిచేస్తున్న ప్రవీణ్, రాజా, విజయలక్ష్మీలను డీపీవో ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై జిల్లాపంచాయతీ అధికారి నారాయణరెడ్డి మాట్లాడుతూ మఠంపల్లి మండలం కిందితండా గ్రామంలో ఓటర్ల జాబితా ఫైనల్‌లో డ్రాఫ్టింగ్ విషయంలో మిస్‌మ్యాచ్ చేశారని గుర్తించి అందుకు బాధ్యులైన వారిని జిల్లా ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎంపీవో, కిందితండా పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారని, వీరితో పాటు మరో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను డీపీవో కార్యాలయానికి అటాచ్ చేశారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం.. కార్యదర్శిపై వేటు

భువనగిరి (కలెక్టరేట్): విధుల్లో నిర్లక్ష్యం వహించిన బొమ్మలరామారం గ్రామపంచాయితీ కార్యదర్శి కే. పద్మజను యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 20న బొమ్మలరామారం మండలాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ గ్రామపంచాయితీ తనిఖీ సందర్భంలో పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరు కాలేదు. విచారణ చేసిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపారు. కార్యదర్శి పద్మజగ్రేడ్-4 ఫిబ్రవరి 20న ఉదయం 11:13 నిమిషాలకు కార్యాలయానికి హాజరయ్యాని, డీఎస్‌ఆర్‌ను బిల్‌కలెక్టర్ ద్వారా అప్‌లోడ్ చేయించినట్లు తేలింది. ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు ఇవ్వకపోవడం, ఆన్‌లైన్‌లో తప్పుడు పన్ను రసీదులు అప్‌లోడ్, సానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణ సరిగ్గాలేదని తేలడంతో సస్పెండ్ చేశారు.



రూ.25 వేల విరాళం

నార్కట్‌పల్లి: మండలంలోని ఏపీలింగోటంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన పశుపతి రూ.25 వేల విరాళం అందజేశారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం సమర్పించారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

● కేతేపల్లిలోని జడ్పీ హైస్కూల్‌లో కేంద్రం

కేతేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 53 మంది మండల కేంద్రం కేతేపల్లిలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 174 నెంబరు పోలింగ్ బూత్‌లో గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మంగళవారం ఎన్నికల సెక్టార్ అధికారి, కేతేపల్లి తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను ఆయన స్థానిక అధికారులతో కలిసి సమీక్షించారు. ఆయన వెంట ఆయా మండలాల ఎంఈవోలు మేక నాగయ్య, కేతేపల్లి జడ్పీ హెచ్‌ఎం తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

శాలిగౌరారం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం భైరవునిబండ, వల్లాల, చిత్తలూరు గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భైరవునిబండలోని శ్రీ గంగా భవానీ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయం, వల్లాల గ్రామంలోని శ్రీ పార్వతి శంభులింగేశ్వర స్వామి, చిత్తలూరు గ్రామంలోని శ్రీ శాంభవి శంభు లింగేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలకరించారు. నేటి నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో రాత్రికి స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయా ఆలయ కమిటీలు, అర్చకులు దండ యాదగిరిరెడ్డి, వావిలాల వేణునాథశర్మ, రామలింగయ్యశర్మ, ఫణికుమార్ శర్మ, కొండగడప హరిప్రసాద్‌శర్మ, కోడూరు ప్రశాంత్‌శర్మ తదితరులు తెలిపారు.


మునుగోడులోని శివరామక్షేత్రం

మునుగోడు: మునుగోడులోని శివరామ క్షేత్రం 11వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయంలో ఈశ్వరుడు, విష్ణువు కొలువుదీరారు. పూర్తిగా రాతికట్టడంగా నిర్మించిన ఈ ఆలయంలో కళాత్మక శిల్పాలు ఎన్నో ఉన్నాయి. గర్భగుడిలో భారీ శివలింగం, ఆలయం ప్రాంగణంలో భారీ నందీశ్వరుడి ఆకృతి ఆకట్టుకుంటాయి. ఎడమవైపున వేంకటేశ్వరుడు, సుబ్రమణ్యేశ్వరుడు, గణపతి, కుడివైపున దక్షిణ ముఖద్వారంగా ఆంజనేయస్వామి దేవతామూర్తులు కొలువుదీరి ఉన్నారు. ఈ ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

కేతేపల్లి: మండలపరిధిలోని వివిధ గ్రామాల్లో గల శివాలయాలు అందంగా ముస్తాబు చేశారు. మండలంలోని ఇనుపాముల, గుడివాడ, కేతేపల్లి, భీమారం, తుంగతుర్తి గ్రామాల్లో ప్రతి యేటా మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో తొలగించిన చారిత్రక పచ్చలపార్వతీ సోమేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు నేటికీ చేపట్టలేదు. స్థానిక బాలాలయంలోనే మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. కేతేపల్లిలోని శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా ఆయా శివాలయాల్లో అభిషేకాలు, విగ్రహమూర్తుల అలంకరణ, శివపార్వతుల కల్యాణం, అగ్ని గుండాలు, శివపార్వతుల ఊరేగింపు కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు ఆయా ఆలయాల కమిటీలు చేపట్టాయి.

కట్టంగూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు జరిగే శివరాత్రికి ముస్తాబయ్యాయి. కట్టంగూరులోని శివాంజనేయ దేవస్థానం, కృష్ణానగర్ వద్ద ఉన్న శివాలయం, మాణిక్యాలమ్మగూడెం వద్ద ఉన్న శివాలయాలు లైట్ల వెలుగులతో అలకరించారు. కలిమెర, అయిటిపాముల ఈదులూరు తదితర గ్రామాల్లో శివాలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దోరేపల్లి శ్రీను, ఆలయ పూజారి బిక్షమాచారి తెలిపారు.


శాలిగౌరారం: వల్లాలలోని శ్రీ పార్వతి శంభులింగేశ్వర స్వామి ఆలయం

కనగల్: కనగల్ గ్రామంలోని బండిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి(తలంబ్రాలు) భక్తులు పాల్గొనాలని ఉత్సవకమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు పి.శంకర్‌శర్మ, పి.గిరిప్రసాద్‌శర్మ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గల శివాలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. పొనుగోడు, దర్వేశిపురం, బుడమర్లపల్లి శివాలయాల్లో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

మర్రిగూడ: మండలకేంద్రంలో భవానీ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26న కల్యాణం నిర్వహించనున్నట్లు పూజారి ఎల్వీశర్మ తెలిపారు. శివరాత్రి సందర్భంగా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జాగారాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నకిరేకల్: నకిరేకల్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు కందాల ప్రవీణ, కొండ వెంకన్నగౌడ్, బొప్పని యాదగిరి, చెన్న చంద్రశేఖర్, ఆలయ పూజారి లక్ష్మీనర్సింహమూర్తి, గీతామందిరం సభ్యులు మంచుకొండ సోమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడిన గోపాల్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న కోదండరాం

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై పన్నాల గోపాల్‌రెడ్డి ఎన్నో పోరాటాలు చేశారని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పన్నాల గోపాల్‌రెడ్డి గెలుపు ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచుతుందని అన్నారు. గోపాల్‌రెడ్డి నాలుగు దశాబ్దాలుగా టీచర్స్ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారని పేర్కొన్నారు. టీచర్ల అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ వర్గానికి ప్రజలకు న్యాయం చేకూర్చగలుగుతాడని అన్నారు. గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. సమావేశంలో అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణ, ప్రభాకర్, పెద్దయ్య, నాగేశ్వరరావుయాదవ్, జగన్నాథంగౌడ్, వెంకట్‌రెడ్డి, క్రాంతికుమార్‌నాయక్, శీలం పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న జరగనున్న వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలవబోతున్నారన్నారు. ఆరేళ్ల క్రితం పీఆర్టీయూను కాదని ఓటు వేసినందుకు ఉపాధ్యాయులంతా తప్పు చేశామన్న బాధతో ఉన్నారని, ఈసారి ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డి గెలుపులో భాగస్వామ్యం కావడానికి ఉపాధ్యాయులంతా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పీఆర్టీయూ పక్షాన ఉపాధ్యాయుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. వాటిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, రాష్ట్ర నాయకుడు సుంకరి భిక్షంగౌడ్, రవీందర్‌రెడ్డి, జగదీష్, కరుణాకర్‌రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీగా రవీందర్‌ను గెలిపించాలి’


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్య ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ కోరారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రవీందర్‌ను శాసనమండలికి పంపి మరోసారి బహుజనుల ఐక్యతను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు కొండేటి నరేష్‌కుమార్, గౌరవ సలహాదారులు కందుల విజయ్, రాష్ట్ర కార్యదర్శి, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌నాయక్, జిల్లా కన్వీనర్ వినోద్, చారి, నాయకులు చిత్రం శ్రీనివాస్, పరశురాం, సాయి, బాలాజీ నాయక్, సురేందర్ పాల్గొన్నారు.

టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో మెడికల్ అండ్ ఎంప్లాయిస్ 2025 క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగిల్ల మురళి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ కేస రవి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, జె.శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కేతేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న వననర్సరీ మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని డీఆర్డీఏ పీడీ వై.శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామ వన నర్సరీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలు మొక్కల గురించి పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కో గ్రామ వన నర్సరీలో 20శాతం మేర ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు, 20 శాతం కమ్యూనిటీ ప్లాంటేషన్ మొక్కలు, 15 శాతం హోం సైడ్ ప్లాంటేషన్ మొక్కలు, 10 శాతం ఈత మొక్కలు పెంచాలని నిర్దేశించారు. ఆయన వెంట ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి, ఏపీవో ఎస్.సురేష్, పంచాయతీ కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, ఎఫ్ఏ జబునిసా బేగం పాల్గొన్నారు.

వేసవిలో నర్సరీ మొక్కలను కాపాడాలి

శాలిగౌరారం: వేసవిలో నర్సరీలను నీరు పోసి కాపాడాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. మంగళవారం వల్లాల గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో జ్యోతిలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె నర్సరీలోని జర్మినేషన్ రిజిస్టర్, నీరు పోసే విధానాన్ని పరిశీలించారు. మొలకెత్తిన మొక్కలను కాపాడడానికి షెడ్‌నెట్ వేయాలని సూచించారు. మొలకలు రాని బ్యాగుల్లో నూతన విత్తనాలను నాటాలని సూచించారు. ఆమె వెంట ఏపీవో జంగమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ యానాల లింగమ్మ పాల్గొన్నారు.


చెర్కుపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న శేఖర్‌రెడ్డి

మర్రిగూడ మండలంలోని కొండూరు, రాజుపేటతండాలో నర్సరీలను ఎంపీడీవో మున్నయ్య పరిశీలించారు. నర్సరీలో మొక్కలను ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట కార్యదర్శులు వంశీకృష్ణ, మధు తదితరులు ఉన్నారు.

బాలికలు లక్ష్యాన్ని ఎంచుకుని ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంక్షేమాధికారి కృష్ణవేణి

నకిరేకల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులో ఉన్న బాలికలు ఎలాంటి ఆకర్షణలకు గురికాకుండా ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఎదగాలని జిల్లా సంక్షేమ వయోవృద్ధులశాఖ అధికారిణి కృష్ణవేణి అన్నారు. నకిరేకల్ జడ్పీ హైస్కూల్‌లో మహిళా, శిశువు, వికలాంగులు, వయోవృద్ధులు, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు.

బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098కి కాల్ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో నాగయ్య, హెచ్‌ఎం రాములు, మెడికల్ ఆఫీసర్ యోగస్వీని, వైష్ణవి, సునీత, అంజమ్మ, పద్మ, సరిత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

కేతేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని ఫాదర్ డి.జోసఫ్ అన్నారు. మండలంలోని భీమారం గ్రామంలో ఏసు తిరుహృదయ చర్చి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చర్చి ఫాదర్ డి.జోసఫ్ నేతృత్వంలో ఏపీ, తెలంగాణ జిల్లాలకు చెందిన వి విధ ప్రాంతాల నుంచి మతగురువులు, మతకన్యలు పాల్గొని ప్రార్థనలు చేశారు. వేడుకలకు హాజరైన పలువురు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రార్థనలు, ఆధ్యాత్మిక బోధనలు మానసిక ప్రశాంతతను చేకూర్చుతాయన్నారు. క్రీస్తు ప్రబోధాలను అందరికీ వి వరించేందుకు క్రైస్తవులు కృషి చేయాలని కోరారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీ రేశం సతీమణి వేముల పుష్ప పాల్గొని క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కాంగ్రెస్ నాయకులు బి. నరేందర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు సర్పంచ్ బి.శ్రీనివాసయాదవ్, బడుగుల రవీందర్ యాదవ్, బి.మురళయ్య, చర్చి కమిటీ సభ్యులు బాలశౌరి, అనిల్, జయరాజు, మొ ల్కయ్య, వివిధ పార్టీల నాయకులు చిమట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


చర్చి వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

మన ఊరు- మన బడికి.. నిధుల గ్రహణం

(3వ పేజీ తరువాయి)

అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం సాగాయి. 16 పనులు మధ్యలోనే నిలిచాయి.

● మిర్యాలగూడ మండలానికి సంబంధించి రూ.14,60,87,337 అంచనా వ్యయంతో 31 పనులు చేపట్టగా రూ.4,12,75,281 విలువైన నిర్మాణాలు జరిగాయి. వాటిలో 17 పాఠశాలల గదుల నిర్మాణం పూర్తికాగా మరో 14 అసంపూర్తిగా నిలిచాయి.

● అనుముల మండలంలో అంచనా వ్యయం రూ.3,20,48,594 నిధులతో 16 పనులు చేపట్టగా రూ.2,76,31,538 మేరకు మాత్రమే పనులు జరిగి ఏ పని పూర్తి కాలేదు.

● వేములపల్లి, అడవిదేవులపల్లి మండలాల్లో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో చేపట్టిన పనుల వివరాలు సైతం సంబంధిత అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. మూడేళ్ల కిందటి మా వద్ద లేవు. అంతా ఆన్‌లైన్ సిస్టమ్, మాకు సంబంధంలేదు. విద్యాశాఖ వద్దే సమాచారం దొరుకుతుందని తప్పుకుంటున్నారు. ఎంఈవోలను అడిగితే తెలియదంటున్నారు. రూ.కోట్లు వెచ్చించి కట్టిన భవనాలు అరకొర పనులతో నిలిచిపోయి విద్యార్థులకు ఉపయోగపడకుండా వృథాగా పడి వుండగా, చేసిన పనికి కాంట్రాక్టర్ల చేతికి డబ్బులు రాక చిన్న, చితక గుత్తేదారులు అవస్థలు పడుతున్నారు.


బిల్లులు రావడం లేదని..



అన్ని చోట్ల 80శాతానికి పైగా నిర్మాణాలు జరిగాయి. ఎంబీ రికార్డుల మేరకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పార్ట్ బిల్లులు విడుదల చేస్తామనడంతో కాంట్రాక్టర్లు చాలాచోట్ల స్లాబ్ లెవల్ పూర్తిచేశారు. ఒకటి రెండు పార్ట్ బిల్లులు పేచేసిన ప్రభుత్వం ఆ తర్వాత విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేదు.

వెంకటేశ్వరరావు, పీఆర్ ఈఈ

తీవ్రంగా నష్టపోయాం



మూడేళ్ల క్రితం మన ఊరు-మనబడి పథకం కింద స్థానిక గర్ల్స్‌హైస్కూల్, బకాల్‌వాడీ స్కూల్స్‌లో అదనపు తరగతి గదులు పనులు చేపట్టాం. బాలికల పాఠశాలలో రూ.కోటి నలభై లక్షల పనులకు మరో రూ.పదిలక్షల పనిమాత్రమే మిగిలి ఉంది. కాగా రూ.67లక్షల బిల్లు రావాల్సి ఉంది. బకాల్‌వాడీ పాఠశాలలో రూ.కోటి పదిలక్షలకు రూ.17 లక్షలు పనులు చేశా. ఆ బిల్లు కూడా విడుదల కాకపోవడంతో పని నిలిపివేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేసి ఆదుకోవాలి.

విద్యాసాగర్‌రెడ్డి, కాంట్రాక్టర్, మిర్యాలగూడ

వాష్ రూమ్స్ కూడా లేవు



ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే ఆలోచనకు పాలకులు దూరమవుతున్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, అదనపు తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లులాంటి మౌలిక వసతులు కల్పించేందుకు మన ఊరు, మన బడి పథకం తెచ్చినా నిధులు విడుదల చేయక పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దామరచర్ల ప్రభుత్వ పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు ఉండగా బాలికలకు వాష్‌రూమ్స్‌లు లేవు. అనేక పాఠశాలల్లో కనీస వసతులు లేవు. ప్రభుత్వం పూనుకుని నిధులు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి.

● శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగమణిరెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న నాగమణిరెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందిమల్ల నాగమణి రెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగమణిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మహిళా కాంగ్రెస్ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. మహిళా కాంగ్రెస్ పార్టీ ఇచ్చే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేస్తానని ఆమె తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే టీచర్ల సమస్యల పరిష్కారం

నాంపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్సీ ఎన్నికల మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జి గొంగిడి లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పస్నూర్, ముష్టిపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో, కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్‌లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ రెడ్డికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయా పాఠశాల ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలు, హెల్త్ కార్డులు, 5 డీఏ విడుదల కావాలంటే ప్రశ్నించే గొంతుకలైన బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నరసింహ, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్, నాయకులు పొలగోని శ్రీకాంత్, కామిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థికసాయం

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కొందరు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి గుత్తా మెమోరియల్ ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మంగళవారం సుమారు రూ.40వేల ఆర్థికసాయం చేశారు. రూపని అండాలు, గుంటోజు పద్మ, సుంకరి రాములు, అలివేలు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, నాయకులు పల్లపు బుద్ధుడు, పట్ల జనార్థన్, జనపాల శ్రీను, లింగయ్య, దినేశ్, ట్రస్టు సభ్యులు ఉయ్యాల నరేష్, నర్సింహ, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతోనే జీవితంలో విజయాలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసంతోనే నిజ జీవితంలో ఎన్నో విజయాలు సాధించవచ్చని ఇంపాక్ట్ సంస్థ వ్యక్తిత్వ వికాస నిపుణుడు నూనె సుదర్శన్ అన్నారు. స్టూడెంట్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి (స్వాన్) ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తెలంగాణ సాంస్కృతిక విభాగం సభ్యురాలు వేముల పుష్ప, ఎంఈవో నర్సింహ, హెచ్‌ఎం రాములు, దూదిమెట్ల సత్తయ్య, స్రవంతి, జెరిపోతుల భరత్, స్వాన్ సభ్యులు గూడూరు అంజిరెడ్డి, దామెర ఉదయ్‌కుమార్, మామిడి సుధాకర్ రెడ్డి, కొమ్ము గిరి, నరసింగరావు, నాగరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టంగా కాదు ఇష్టంతో చదవాలి : సీఐ


టాలెంట్ టెస్టు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కా కుండా ఇష్టపడి చదవాలని నల్లగొండ వన్‌టౌ న్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన వి ద్యార్థులకు నిర్వహించనున్న టాలెంట్ టెస్టుకు సంబంధించి రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలనే భయాన్ని వీడి ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని, పరీక్షలకు మంచిగా సన్నద్ధం కావాలని సూచించారు. ఇలాంటి టాలెంట్ టెస్టులు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగప డతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుంచం కావ్య, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ. సైఫ్, మారుపాక కిరణ్, స్పందన, సిరి, సాయి పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

నాంపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం మండల కేంద్రంలో గల ఎస్సీ బాలుర హాస్టల్ వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయని, విద్యార్థులకు కావాల్సిన మంచినీరు, మరుగుదొడ్లు, సౌకర్యాలు సరిగా లేవని అన్నారు. సొంత భవనాలు ఉన్న హాస్టళ్లలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కామాటీ, వాచ్‌మన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు అన్నెపాక అనిల్, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	155	170
సూర్యాపేట	రూ.100	150	175
నల్లగొండ	రూ.115	160	170

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 కనిష్ఠం 20.0

హర హర మహాదేవ!



విద్యుత్‌కాంతుల వెలుగుల్లో పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయం

మహాశివుడు ఉద్భవించిన రాత్రి మహాశివరాత్రి. మాఘ బహుళ చతుర్దశి అర్ధరాత్రి ఆరుద్ర నక్షత్రంలో మహాశివుడు ఉద్భవించాడని శివ పురాణం చెబుతోంది. మహాశివుడు ఉద్భవించిన సమయాన్ని లింగోద్భవ కాలమని అంటారు. అలాంటి మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. జాగారం చేస్తూ శివనామ స్మరణతో తరిస్తారు. అందుకు జిల్లాలోని ప్రముఖ శివాలయాలన్నీ సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆలయాలను శుద్ధి చేసి వివిధ రంగులతో అలంకరించారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రత్యేకంగా భక్తులకు వసతి కల్పించారు. జిలాల్లోని ప్రముఖ దేవాలయాలైన పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర ఆలయంతోపాటు పలు ఆలయాల్లో సర్వం సన్నద్ధం చేశారు.



వేడుకలకు ముస్తాబైన పానగల్‌లోని పచ్చల సోమేశ్వరాలయం

6 ● నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు ● ముస్తాబైన శివాలయాలు

మన ఊరు-మన బడికి.. నిధుల గ్రహణం

● అసంపూర్తిగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తిగా నిలిచిన గాంధీపార్క్ పాఠశాలలోని తరగతి గదుల నిర్మాణం

మన ఊరు మన బడి పథకం కింద ప్రారంభించిన తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. నిధులు విడుదల చేయకపోవడంతో 2022లో ప్రారంభించిన పనులను కాంట్రాక్టర్లు అనేక చోట్ల పూర్తి చేయలేదు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదన్న విమర్శలున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలన్న లక్ష్యం నిధుల్లేక నీరసించిపోతోందని విద్యాకమిటీల నేతలు విమర్శిస్తున్నారు. పనులు పూర్తయిన మేరకు ఎంబీ రికార్డు చేస్తే నిధులు మంజూరు చేస్తామన్నారని, అప్పులు తెచ్చి పనులు చేస్తే ప్రభుత్వం నిలువునా ముంచిందని విమర్శిస్తున్నారు. పనులు మొదలైన తొలినాళ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకటి, రెండు పార్ట్‌బిల్స్ విడుదలచేసి 2023 మే తర్వాత రేపు మాపు అంటూ నిధుల విడుదలను పెండింగ్‌లో పెట్టారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. గత మూడేళ్లుగా బిల్లులకోసం ఎదురు చూడాల్సి వస్తోందని అప్పులు తీర్చలేక, నలుగురిలో తిరగలేక ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో..

పంచాయితీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో మూడుమండలాల్లో సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన 63పనుల్లో 17 మాత్రమే పూర్తి కాగా నిధులు మంజూరు చేయక 46 పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

● దామరచర్ల మండలంలో రూ.3,20,48,594 అంచనా వ్యయంతో 16పనులు చేపట్టగా రూ.1,67,74,135 మేరకు మాత్రమే పనులు..

- మిగతా 6వ పేజీలో...

ప్రలోభాల పర్వం

ముగిసిన ప్రచారం

- ఫోన్‌పేకు రూ.2వేలు పంపుతున్న వైనం
- ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అధికారుల చర్యలు

ఉపాధ్యాయ సంఘాలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ముగియగానే ఓట్లకోసం ప్రలోభాలు మొదలయ్యాయి. మేధావి వర్గానికి సైతం ప్రలోభాల ఎరవేయడంపై విమర్శలు వస్తున్నప్పటికీ అడ్డదారులు ఆగడం లేదన్న చర్చ సాగుతోంది. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గంలో బలంగా పోటీపడుతోన్న కొందరు అభ్యర్థుల తరఫున వారికి మద్దతిస్తోన్న, వారి తరఫున పనిచేస్తున్న ప్రతినిధులు ఇప్పటి కే ఎక్కడికక్కడ విందులతో సందడి చేస్తుండగా, మంగళవారమే కొంద రు ప్రతినిధులు కవర్లలో ఓట్లకు డబ్బులందించారని, మరో అభ్యర్థి తరఫున ఫోన్‌పేలలో డబ్బు అందించార ని చెబుతున్నారు. ఇంకో అభ్యర్థి తరఫున పనిచేసే ప్రతినిధులు మొత్తం ఓటర్ల జాబితా, వారి ఫోన్‌నెంబర్లు, వారి కుటుంబీకుల ఫోను నెంబర్లు సేకరించారని, వీరందరికీ బుధవారం లేకపోతే గురువారం ఓటింగ్‌కు వెళ్లే సమయానికి నగదు పంపిణీ చేస్తారని చెబుతున్నారు. మంగళవారమే అభ్యర్థులకు సంబంధించి ఓట్లకు డబ్బుల పంపిణీ మొదలుపెట్టినట్లు సోషల్‌మీడియా గ్రూపులలో వైరల్ గా మారడం చర్చనీయాంశంగా మారింది. పరిమిత ఓటర్లు, మేధావి వర్గమైన ఉపాధ్యాయులకే ఓట్లకోసం డబ్బు ఎరవేయడం దారుణమని, ఈ ప్రలోభాలపై ఎన్నికల సంఘం దృష్టి సారించి చర్యలు చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

హైస్కూల్ ఓట్లే 90 శాతం వరకు..

బలమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో కీలకమైన ఉపాధ్యాయ విభాగపు ఓట్ల కోసం ప్రధాన అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఎన్నికల బరిలో ...

- మిగతా 5వ పేజీలో...



ప్రలోభపెట్టాలని ప్రయత్నించడం దారుణం : టీఎస్‌యూటీఎఫ్

నల్లగొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేయాలనే ప్రయత్నాలు చేయడం దారుణమని, ఈచర్యలను ఉపాధ్యాయులంతా అడ్డుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావా రవి, ఏ.వెంకట్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రచారం ముగిసిన వెంటనే కొందరు అభ్యర్థులు ప్రలోభాలకు తెరదీసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక అభ్యర్థి పక్షాన గుర్తుతెలియని వ్యక్తులు రూ.2వేల ఫోన్‌పే చేస్తున్నారని తెలిపారు. కొందరు ఓటర్లు ఆ డబ్బుని తిరస్కరిస్తూ రిటర్న్ పేమెంట్ చేశారని వెల్లడించారు. మరో ప్రముఖ సంఘం పక్షాన భద్రాద్రి జిల్లాలో రూ.100, ఖమ్మం జిల్లాలో రూ.2వేలు, మహబూబాబాద్ జిల్లాలో రూ.5వేల చొప్పున పంపిణీ చేసినట్లు తమకు సమాచారమొచ్చిందన్నారు. నగదుని తిరస్కరించిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నామని పేర్కొన్నారు. డబ్బు పంపిణీని తమసంఘం తీవ్రంగా ఖండిస్తుందని, ఎన్నికల సంఘం డబ్బు పంపిణీని అడ్డుకోవాలని, పంపిణీ చేసిన, చేస్తున్న అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ రోజున విద్యాసంస్థలకు సెలవు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టౌన్: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈ నెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిమిత్తం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, కార్యాలయాలకు స్థానిక సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఆయా విద్యాసంస్థలు, కార్యాలయాల అధిపతులు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ రోజున స్థానిక సెలవు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 37పోలింగ్ కేంద్రాలున్నాయని, పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించే ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలకు 27న స్థానిక సెలవుదినంగా ప్రకటిస్తున్నట్లు వివరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు

- ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు. పోలింగ్‌కు ముందు 48 గంటలు అనగా.. 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ పోలింగ్ ముగిసే వరకూ సైలెంట్ పీరియడ్ ఉంటుందన్నారు. సైలెంట్ పీరియడ్‌లో సభలు, సమావేశాలు నిర్వహించరాదని, సుమారు 600మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికలు ముగిసే వరకూ 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉంటుందన్నారు.

సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షిస్తాం

● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గం ఇన్‌లెట్ వద్ద జరిగిన ఘటనలో చిక్కుకున్న బాధితులను రక్షించడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం దోమలపెంట శ్రీశైలం సొరంగమార్గాన్ని పరిశీలించి, తిరుగు ప్రయాణంలో దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు ఆగారు. ఎమ్మెల్యే బాలునాయక్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సొరంగమార్గం ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అందులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, కొర్ర రాంసింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాన్‌యాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, వేమన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలి

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



జిల్లాకేంద్ర ఆస్పత్రిలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, పక్కన ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కొన్ని కేసుల విషయంలో రోగులు, వారి సహాయకులు డాక్టర్లను, సిబ్బందిని పరుష పదజాలంతో దూషించడం వంటి సంఘటనలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని, డాక్టర్లను ఇబ్బంది పెట్టవద్దని ఆమె కోరారు. గతంతో పోలిస్తే జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. మంగళవారం ఆమె జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మాతా, శిశు సంరక్షణ విభాగం, ఇతర విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలున్నాయని, సమర్థులైన డాక్టర్లు ఉన్నారని తెలిపారు. 24 గంటలు కాకుండా 48 గంటలు నిరంతరం పనిచేసేందుకు ఇక్కడ డాక్టర్లు సంసిద్ధులుగా ఉన్నారన్నారు. సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారని, రేడియాలజిస్టును కూడా డిప్యూటేషన్‌పై తీసుకున్నట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరుగుతున్న సంఘటనల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ కొంతమంది కావాలని డాక్టర్లను, సిబ్బందిని వేదిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేయవద్దని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, ప్రధానాస్పత్రి సూపరింటిండెంట్ అరుణశ్రీ, డాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

● జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, నీటి సరఫరా, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవిలో ఎక్కడెక్కడ నీటి ఎద్దడి ప్రబలంగా ఉంటుందో ఇప్పటినుంచే అంచనా వేసి అందుకు తగినట్టుగా చర్యలు చేపట్టాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కే.ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్, భగీరథ గ్రిడ్, ఏఈలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి

ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫెయిర్‌వెల్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలించి యువతను సన్మార్గంలో పయనించే విధంగా చేయాలనే ఉద్దేశంతో 'మిషన్ పరివర్తన్' కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్, షీటీమ్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైనా వేధింపులకు గురి చేసినా ఇబ్బందులు పెట్టినా వెంటనే షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐఈవో దస్రునాయక్, రిటైర్డు ప్రిన్సిపాల్ మందడి నర్సిరెడ్డి, ఇస్మాయిల్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సంత్‌సేవాలాల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భగవాన్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోజు ప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ లంబాడీల ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలో బంజార భవన్ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 20 గుంటల స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.20లక్షలను మంజూరు చేశారని తెలిపారు. మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, భగవాన్ నాయక్, ఆంగోతు ప్రదీప్ నాయక్, రిటైర్డు డీటీడబ్ల్యూవో పాండు నాయక్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ ఉన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలకు

మీ కుటుంబ సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ సహోద్యోగులలో ఎవరైనా

పదవీ విరమణ చేస్తున్నారా?

అయితే వారికి తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా

అందించండి పదవీ విరమణ శుభాకాంక్షలు



ఆంధ్రజ్యోతి ఇస్తోంది 25% రాయితీ

వివరాలకు: ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగం

నల్లగొండ :99854 13656, 99854 13365

సూర్యాపేట :97036 18713

కోదాడ :80967 10822

దేవరకొండ, మిర్యాలగూడ, భువనగిరి, చౌటుప్పల్ : 99854 10384

నోట్: ఈ రాయితీ ఇయర్ ప్యానల్ యాడ్‌లకు వర్తించదు

ఆంధ్రజ్యోతి కార్యాలయం

అద్దంకి బైపాస్ రోడ్, ఆర్జాలబావి, నల్లగొండ, సెల్ : 9985410384

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి : సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి టీచర్లు పనిచేయాలని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి అన్నారు. మండలకేంద్రంలోని ఐదవ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన వందనపు ప్రవీణ్, సౌమ్య దంపతులు కేంద్రానికి తాగునీటి కోసం నల్లా డబ్బాను అందించారు. కేంద్రాల నిర్వహణకు దాతలు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, సిబ్బంది పద్మావతి, హసీనా పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి'

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో బీసీలకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను కోరారు. సమావేశంలో నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, నవాబ్, గణేష్, నరేంద్రాచారి, పవన్, రమేష్ పాల్గొన్నారు.

యాద్గార్‌పల్లిలో ప్రత్యేక పూజలు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి, పర్వతవర్థిని సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కర్త, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం ఆలయంలో 5 గంటలకు సుప్రభాత సేవ, 6గంటలకు నవకలశ స్నపనము, పంచామృతాభిషేకం, మహాన్యాస రుద్రాభిషేకం, 8గంటలకు అలంకరణ, విశేష పుష్పార్చన, రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.


విద్యుద్దీపాలంకరణలో యాద్గార్‌పల్లి గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం

వైద్యసహాయంతో పునర్జన్మ

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


వైద్యశిబిరంలో ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైద్య సహాయం ఎంతోమందికి పునర్జన్మ నిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంతో మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య పరీక్షలు చేయించుకోలేక పోవడంతో వ్యాధి లక్షణాలు తెలియక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. ఈసీజీ, 2డి ఈకో, ఆర్థో నిపుణులతో మెగా వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న మిల్లర్స్‌కు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులకు స్టార్ వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాల కోసం గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల్లో ఎంతోమంది పేదలే ఉన్నారని, వారికి వారికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మిల్లర్స్, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, నరేపాల మధుసూధన్, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, స్టార్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలి'

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని బీసీ సంఘాల నాయకులు గాదగోని మహేష్‌గౌడ్, తిరుమలగిరి అశోక్ ఉపాధ్యాయులను కోరారు. పట్టణంలోని బీసీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తెలిసిన పూల రవీందర్‌ను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రతినిధిగా ఆయన్ను ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు సురేష్, రవీందర్‌నాయక్, వెంకన్న, ఉపేందర్, శ్రీను పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కాకతీయ ఉన్నత పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్ అన్నారు. పట్టణంలోని కాకతీయ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లీష్ ఒలంపియాడ్ టెస్ట్‌లో తమ విద్యార్థి పి.తన్వి రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు, వై.వేదిక్‌రెడ్డి రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు, ఆర్. జితేష్ గురుసాత్విక్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించడం ఆదర్శనీయమన్నారు. అదేవిధంగా జె.యశ్వంత్, ఎల్.ఇషాంత్, జిల్లా ఉదయ్‌కుమార్, చీదళ్ల తన్విశ్రీ, ధైద వివేకనందన్, తల్లూరి మణిచందన్, అంజలి, ఎం.సాయితులసీకి డిస్ట్రిక్ట్ కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకితభావంతోనే ఉత్తమ ర్యాంకులు సాధించగలిగినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు బీజేపీతోనే పరిష్కారం

వేములపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు బీజేపీతోనే పరిష్కారమవుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పన్ను సడలింపు ద్వారా ప్రతి ఉపాధ్యాయునికి రూ.25 నుంచి రూ.40 వేల మేర పన్ను మినహాయింపు లభించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క డీఏ పెండింగ్ లేకుండా చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్‌లో ఉంచిందని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘాలు పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిర్ర సాంబమూర్తి, కర్ర దామోదర్‌రెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం ప్రసాద్, బొంగర్ల శ్రీను, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.


కెట్టెపాలెంలో ప్రచారం చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


నిడమనూరు మండలం వెంగన్నగూడెంలోని శివాలయం

నిడమనూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో జాతరను నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు శివనామ స్మరణతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. మండల కేంద్రంలోని పురాతన నాగలింగేశ్వరస్వామి, ముప్పారం గ్రామంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి, వెంగన్నగూడెం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి, తుమ్మడం గ్రామంలో ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లో ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి. నిడమనూరులోని పురాతన శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఇక్కడ శివరాత్రికి ఒకరోజు ముందే శివపార్వతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముప్పారం గ్రామంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుంది. జాతరలో భాగంగా ప్రతియేటా నిర్వహించే అగ్నిగుండాలు కార్యక్రమాన్ని 27వ తేదీన గురువారం రాత్రి కన్నుల పండువగా నిర్వహిస్తారు. వెంగన్నగూడెం, తుమ్మడం ఆలయాల్లో 26న బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవం చేయనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

ఏళ్ల చరిత్ర

దేవరకొండ: దేవరకొండ మండలంలోని కమలాపూర్ కాళీసమేత వీరభద్రస్వామి దేవాలయానికి 850ఏళ్ల చరిత్ర ఉంది. దేవరకొండ ఖిల్లాలోని దేవాలయాలతో పాటు వీరభద్రస్వామి ఆలయాన్ని కూడా నిర్మించినట్లు పూర్వీకుల కథనం. ఆలయంలో చేదుడుబావికి సుదీర్ఘ చరిత్ర ఉంది. భక్తులు మొదటగా ఈ బావి నీటితో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. ఎంత కరువు వచ్చిన బావిలో నీరెండిన సందర్భాలు లేవు. బావి నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ప్రతీ ఏడాది ఫిబ్రవరిలో బ్రహోత్సవాలు, జాతరను నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల జిల్లాల భక్తులు కూడా తరలివస్తారు. ఈ నెల 26 నుంచి మార్చి 5వ తేదీ వరకు బ్రహోత్సవాలు, రథోత్సవం, రథాలు, సామూహిక రథాలు, జాతర ఉత్సవాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. దేవరకొండకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి దేవరకొండ నుంచి భీమనపల్లి ప్రాజెక్టు కట్టకొమ్ముతండా మీదుగా రోడ్డు సౌకర్యం ఉంది. దేవరకొండ నుంచి ఆర్టీసీ సర్వీసులతో పాటు ఆటోల సౌకర్యం ఉంది.


దేవరకొండ: కమలాపూర్ వీరభద్రస్వామి దేవాలయం

నేడు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు

అడవిదేవులపల్లి: మహాశివరాత్రి సందర్భంగా మండల శివారులోని కృష్ణా నది తీరంలో గల పంచయాతన పార్వతీ పరమేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి యడవెల్లి రఘురామశర్మ తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఏర్పాట్లు పూర్తి

చింతపల్లి: శివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు వేంకటేశ్వరనగర్‌లోని భక్త మార్కండేయ, శివాలయంలో బుధవారం నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకొని ఆలయాల్లోకి వెళ్లి అభిషేకాలు చేయనున్నారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించేందుకు పందిళ్లతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని చైర్మన్లు వూరె లక్ష్మణ్, పున్న సత్యనారాయణ తెలిపారు.

గురుకులంలో భద్రతకు చర్యలు

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక


గురుకుల విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గిరిజన గు రుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉ న్నత శిఖరాలను అధిరోహించాలని, గురుకుల విద్యార్థులకు పోలీ స్‌శాఖ ఆధ్వర్యంలో భద్రత చర్యలు చేపట్టనున్నట్లు దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు. దేవరకొండ పట్టణశివారు పెంచికల్‌పహాడ్‌లో గల ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలను మంగళవా రం ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య వివరాలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. వి ద్యార్థినులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. గురుకులాలలో ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందిస్తోందని, భోజనం రుచికరంగా ఉందన్నారు. గురుకుల పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలతో నిఘా, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు కూడా రాత్రివేళలో పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఏఎస్పీ వెంట దేవరకొండ ఎస్ఐ రమేష్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమాదేవి ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం


సమావేశంలో మాట్లాడుతున్న నల్ల వెంకటయ్య

దేవరకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య ఆరోపించారు. దేవరకొండ సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సీపీఎం, ప్రజాసంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులతో కేంద్రప్రభుత్వం కుమ్మక్కైందని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై సీఐటీయూ పోరాడుతుందన్నారు. సమావేశంలో సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు బిజిలి లింగయ్య, నాగరాజు, వెంకటేష్, నర్సింహ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టం గురించి వివరించాలి

● జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు



వినియోగదారుల ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్వో వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టం 2019 గురించి మారుమూల గ్రామీణులకు తెలిసేలా చూడాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో వినియోగదారుల రక్షణ చట్టంపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తయారు చేయబడిన ప్రతీ వస్తువుపై తయారీ తేదీ, ఎప్పటి వరకు పనిచేస్తుంది, దాని విలువ ఎంత అనేది ఉందో లేదో చూసుకొని కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన వస్తువుకు రశీదు తీసుకోవాలని ఆయన సూచించారు. వారు ఇచ్చిన నిబంధనల ప్రకారం పని చేయకపోయినా, ఇచ్చిన గ్యారెంటీని వినియోగదారుడు పొందలేకపోయినా వినియోగదారుల రక్షణ చట్టం ద్వారా వినియోగదారుల ఫోరానికి అప్పీలు చేసి న్యాయం పొందవచ్చని సూచించారు. నాసిరకం వస్తువులు కొని మోసపోకుండా ప్రతీ వినియోగదారునికి చట్టం గురించి అవగాహన పెంపొందించాలని అన్నారు. వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ధరలు, తూకంతో పాటు నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేసి రశీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల జిల్లా అధ్యక్షుడు హిమగిరి, నాయకులు ఏలె వెంకటేశ్వర్లు, గురువయ్య, పూర్ణచందర్‌రావు, గోళ్ల రంగయ్య పాల్గొన్నారు.

మన ఊరు - మన బడికి.. నిధుల గ్రహణం

(3వ పేజీ తరువాయి)

● అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం. సాగాయి. 16 పనులు మధ్యలోనే నిలిచాయి.

● మిర్యాలగూడ మండలానికి సంబంధించి రూ.14,60,87,337 అంచనా వ్యయంతో 31 పనులు చేపట్టగా రూ.4,12,75,281 విలువైన నిర్మాణాలు జరిగాయి. వాటిలో 17 పాఠశాలల గదుల నిర్మాణం పూర్తికాగా మరో 14 అసంపూర్తిగా నిలిచాయి.

● అనుముల మండలంలో అంచనా వ్యయం రూ.3,20,48,594 నిధులతో 16 పనులు చేపట్టగా రూ.2,76,31,538 మేరకు మాత్రమే పనులు జరిగి ఏ పని పూర్తి కాలేదు.

● వేములపల్లి, అడవిదేవులపల్లి మండలాల్లో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో చేపట్టిన పనుల వివరాలు సైతం సంబంధిత అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. మూడేళ్ల కిందటి మా వద్ద లేవు. అంతా ఆన్‌లైన్ సిస్టమ్, మాకు సంబంధంలేదు. విద్యాశాఖ వద్దే సమాచారం దొరుకుతుందని తప్పుకుంటున్నారు. ఎంఈవోలను అడిగితే తమకు తెలియదంటున్నారు. రూ.కోట్లు వెచ్చించి కట్టిన భవనాలు అరకొర పనులతో నిలిచిపోయి విద్యార్థులకు ఉపయోగపడకుండా వృథాగా పడి వుండగా, చేసిన పనికి కాంట్రాక్టర్ల చేతికి డబ్బులు రాక చిన్న, చితక గుత్తేదారులు అవస్థలు పడుతున్నారు.

తీవ్రంగా నష్టపోయాం



మూడేళ్ల క్రితం మన ఊరు-మన బడి పథకం కింద స్థానిక గర్ల్స్‌హైస్కూల్, బకాల్‌వాడీ స్కూల్స్‌లో అదనపు తరగతి గదులు పనులు చేపట్టాం. బాలికల పాఠశాలలో రూ.కోటి నలభైలక్షల పనులకు మరో రూ.పదిలక్షల పనిమాత్రమే మిగిలి ఉంది. కాగా రూ.67లక్షల బిల్లు రావాల్సి ఉంది. బకాల్‌వాడీ పాఠశాలలో రూ.కోటి పదిలక్షలకు రూ.17 లక్షలు పనులు చేశా. ఆ బిల్లు కూడా విడుదల కాకపోవడంతో పని నిలిపివేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేసి ఆదుకోవాలి.

● విద్యాసాగర్‌రెడ్డి, కాంట్రాక్టర్, మిర్యాలగూడ

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దామరచర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి భైరం దయాంద్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా గ్రామపంచాయతీ కార్మికుల బతుకు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం అందించాలని, కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, అర్హులైన సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాతులోతు విజయ్‌కుమార్, గుండు వెంకటేశ్వర్లు, అక్కినపల్లి సైదులు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలి

● ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల గొంతుకైన తనకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులను ఆయన కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు రాజకీయ పార్టీల కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేశారని, ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ టీజేఎస్ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు లావూరి క్రాంతికుమార్, ప్రకాష్‌నాయుడు, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి : బీజేపీ

చింతపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేతావత్ లాలునాయక్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దుతో పాటు, ఉపాధ్యాయులకు ఆరోగ్య బీమా కార్డులు, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్న బకాయిలు అందించేందుకు ప్రణాళిక తయారు చేసినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు సంపూర్ణ మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, పార్టీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, నాయకులు శివర్ల రమేష్ యాదవ్, వనం నరేందర్‌రెడ్డి, కుక్కడపు రామకృష్ణ, గడ్డి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

నిడమనూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువు పూర్తి చేసుకున్న పదో తరగతి విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలను విడిచి వెళ్లడం బాధగా ఉన్నా ఉన్నత చదువుల దృష్ట్యా తప్పదని ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కందికట్ల ధన్వంతరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చింతపల్లి, హాలియా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యో తి): చింతపల్లి మండలంలోని వేం కటేశ్వరనగర్ వెంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ఘ నంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెనగోని వెంకటయ్యగౌడ్, ఎస్.పర్వతాలు, డైరెక్టర్లు అంగిరేకుల రాజు, అనంతుల వెంకటయ్య, రమేష్, పంగ కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

● నేటి విద్యార్థులే రేపటి భావి భారత దేశానికి జాతి నిర్మాతలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు.


కుందూరు జానారెడ్డిని సన్మానిస్తున్న పట్టణ ప్రముఖులు

హాలియాలోని హాలియా పబ్లిక్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. హాలియా పబ్లిక్ స్కూల్ విలువలతో కూడిన విద్యను అందించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కేతావత్ శంకర్‌నాయక్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మలిగిరెడ్డి లింగారెడ్డి కాకునూరి నారాయణగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.